


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL   ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి   శుక్రవారం 03 సెప్టెంబరు 2021   సంపుటి : 03   సంచిక : 30   పేజీలు : 4   వెల : రూ 3-00


## వైఎస్సార్ మనసున్న మహారాజు: ఎంపీ విజయసాయిరెడ్డి



విశాఖపట్నం: వైఎస్సార్ మనసున్న మహారాజు అని ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. విశాఖలో వైఎస్సార్ సంస్మరణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దివంగత మహానేత వైఎస్సార్ సుపరిపాలన అందించారన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితో ముందడుగు వేస్తున్నామన్నారు. తండ్రి బాటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తున్నారని తెలిపారు. "ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగన్ నెరవేరుస్తున్నారు. ఎక్కడా అవినీతికి తావులేకుండా పాలన చేస్తున్నాం. పార్టీలో కష్టపడిన వారందరికీ న్యాయం జరుగుతుంది. ప్రభుత్వ భూములు ప్రజలకే చెందాలన్నది మా లక్ష్యం. ఎక్కడైనా భూ ఆక్రమణలు జరిగితే ఫిర్యాదు చేయొచ్చు. అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని" ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు.

వ్యవసాయాన్ని పండగ చేశారు: మంత్రి అవంతి

దివంగత మహానేత వైఎస్సార్ భౌతికంగా లేకపోయిన ప్రజల గుండెల్లో కొలివై ఉన్నారని మంత్రి అవంతి శ్రీనివాస్ అన్నారు. పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. వ్యవసాయాన్ని పండగ చేసి చూపించారనికొనియాడారు. రాష్ట్రాన్ని సంక్షేమ రాజ్యంగా మార్చిన గొప్ప నేత అని, అభివృద్ధి విషయంలో వైఎస్సార్ రాజకీయాలు చూడలేదని మంత్రి అవంతి అన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందాలి: సీఎం జగన్



తాడేపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆస్పత్రుల్లో వైద్య సేవలపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని సూచించారు. కోవిడ్ నివారణ చర్యలపై సీఎం వైఎస్ జగన్ గురువారం తాడేపల్లి క్యాపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబ్ల్యూహెచ్‌ఓ, జీఎంపీ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన మందులు అందించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వాస్పత్రికి వెళ్తే రోగం తగ్గుతుందనే భరోసా ప్రజలకు రావాలని అధికారులకు తెలిపారు. రాష్ట్రంలో రాత్రి కర్ఫ్యూ కొనసాగుతుందని, రాత్రి 11 గంటల నుంచి ఉదయం? 6 గంటల వరకు కర్ఫ్యూ ఆంక్షలు అమల్లో ఉంటాయని సీఎం జగన్ పేర్కొన్నారు. వినాయక చవితి ఉత్సవాలు ఇళ్లకే పరిమితమయ్యేలా చర్యలు తీసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయొద్దని వైద్య అధికారలు సీఎం జగన్‌కు సిఫార్సు చేశారు. నిమజ్జన, ఊరేగింపులు వద్దని వైద్య అధికారలు సిఫార్సు ద్వారా సీఎం దృష్టికి తీసుకువచ్చారు. వైద్య అధికారుల సిఫార్సుల మేరకు చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు తప్పవని సీఎం తెలిపారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం ఆళ్ల నాని, కోవిడ్ టాస్క్ ఫోర్స్ అధికారులు పాల్గొన్నారు.

## 'అలాంటి వార్తలు దేశానికి చెడ్డపేరు తెస్తున్నాయి..'

### సోషల్‌మీడియాలో నకిలీ వార్తల ప్రచారంపై సుప్రీం అసహనం

దిల్లీ: సోషల్‌మీడియా, వెబ్ పోర్టళ్లలో నకిలీ, తప్పుడు వార్తల ప్రచారంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. కొన్ని మాధ్యమాల్లో ప్రతి విషయాన్ని మత కోణంలోనే చూపుతున్నారని, దీని వల్ల దేశానికి చెడ్డ పేరు వస్తోందని విచారించింది. సామాజిక మాధ్యమ సంస్థలు కేవలం బలవంతులకే స్పందిస్తున్నాయని, సామాన్యుల పట్ల బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. తబ్లీగి జమాత్ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ నేతృత్వంలోని ధర్మాసనం నేడు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సోషల్‌మీడియా, వెబ్ పోర్టళ్లపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. "దేశంలో ప్రతి విషయాన్ని మత కోణంలో చూపుతున్నారు. ఇది దేశంపై దుష్ప్రభావం చూపుతోంది. సోషల్‌మీడియా, వెబ్ పోర్టళ్లలో కంటెంట్ విషయంలో జవాబుదారీతనం కన్పించట్లేదు. వీటిపై ఎలాంటి నియంత్రణ లేకుండా పోయింది. సామాజిక మాధ్యమాలు దేన్నయినా ప్రచురించగలుగుతున్నాయి. ఎవరైనా యూట్యూబ్ ఛానల్ ప్రారంభించే అవకాశం



ఉంది. నియంత్రణ వ్యవస్థ లేక వ్యక్తుల పరువుకు నష్టం జరుగుతోంది. వ్యవస్థలు, న్యాయమూర్తులను కూడా చెడుగా చూపిస్తున్నారు" అని జస్టిస్ ఎన్.వి. రమణ అసహనం వ్యక్తం చేశారు. సోషల్‌మీడియా సంస్థలు కేవలం బలవంతుల మాటలనే వింటున్నాయని, ఎలాంటి జవాబుదారీతనం లేకుండా వ్యవస్థలు, న్యాయమూర్తులకు వ్యతిరేకంగా వార్తలు ప్రచారం చేస్తున్నాయని జస్టిస్ రమణ ఆగ్రహించారు. సామాజిక మాధ్యమ వేదికలు సామాన్యులకే కాదు.. న్యాయమూర్తులకు కూడా స్పందించట్లేదని అన్నారు. ఈ పరిణామాలను నియంత్రించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఐటీ నిబంధనలపై అన్ని హైకోర్టుల్లో దాఖలపై పిటిషన్లను సుప్రీంకోర్టుకు బదిలీ చేస్తున్నట్లు ఈ సందర్భంగా ధర్మాసనం వెల్లడించింది. వీటిపై ఆరు వారాల తర్వాత విచారణ చేపడతామని తెలిపింది.

## వైఎస్సార్ ఆచరణలో నుంచి ఓ మహావృక్షం పెరిగింది: సజ్జల

### వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం



అమరావతి: పాలకుడు ఎలా ఉండాలో చూపించిన వ్యక్తి మహానేత వైఎస్సార్ అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ 12వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి సజ్జల రామకృష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే పార్థసారథి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, డొక్కా మాణిక్య వరప్రసాద్, జూపూడి ప్రభాకర్, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, తెలుగు అకాడెమీ చైర్ పర్సన్ లక్ష్మీపార్వతి, మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్ ఆచరణలో నుంచి ఓ మహావృక్షం పెరిగిందన్నారు. నాన్న వేసిన అడుగుకి పదడుగులు వైఎస్ జగన్ వేశారన్నారు. వైఎస్సార్ ఆశయాలకు శాశ్వత ముద్ర ఉండేలా వైఎస్ జగన్ పాలన చేస్తున్నారన్నారు. సీఎం జగన్‌ను బలోపేతం చేస్తూ ఆయన అడుగులో అడుగు వేద్దామని పిలుపునిచ్చారు.

తండ్రి బాటలో సీఎం జగన్: లక్ష్మీపార్వతి

పేద ప్రజల గుండెల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచిపోయారని తెలుగు, సంస్కృత భాషా అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. వైఎస్సార్ మరణించినా.. ఆయన జ్ఞాపకాలు నిలిచే ఉన్నాయన్నారు. తండ్రి బాటలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తున్నారన్నారు. లోకేష్ అసమర్థుడని.. ఎప్పటికీ నాయకుడు కాలేడని లక్ష్మీ పార్వతి వ్యాఖ్యానించారు.

## ముఖ్యమంత్రికి ఘన వీడ్కోలు

కడప, సెప్టెంబర్ 2 రెండురోజుల జిల్లా పర్యటనను ముగించుకుని విజయవాడకు బయలుదేరి వెళ్లిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి.. గురువారం ఉదయం కడప విమానాశ్రయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం ఉదయం ఇడుపులపాయలో దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్న ఆయన.. అనంతరం హెలికాప్టర్ ద్వారా ఉదయం 11.30 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ నుండి ప్రత్యేక విమానంలో 11.45 గంటలకు విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా.. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు తో పాటు.. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, జిల్లా ఇంచార్జ్ మంత్రి ఆదిమూలపు సురేష్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు అంబటి కృష్ణారెడ్డి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సలహాదారులు రాజోలు వీరారెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, డిప్యూటీ మేయర్, నిత్యానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, డిఐ జి వెంకట్రామిరెడ్డి, ఎస్పీ అన్బు రాజన్, జేసీ (రెవెన్యూ) గౌతమి, కడప సబ్ కలెక్టర్ పృద్వితేజ్ లు ముఖ్యమంత్రికి ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రత్యేక విమానంలో ముఖ్యమంత్రితో పాటు ఆయన సతీమణి వైఎస్ భారతి, ముఖ్య కార్యదర్శి ధనుంజయ రెడ్డి, ఓఎస్డీ కృష్ణ మోహన్, సహాయ వ్యక్తిగత కార్యదర్శి నాగేశ్వర రెడ్డి వున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి వీడ్కోలు పలికిన వారిలో.. కడప డిఎస్పీ సునీల్, కడప నగర పాలక కమిషనర్ రంగస్వామి తదితరులు ఉన్నారు. కోవిడ్ నిబంధనల మేరకు.. విమానాశ్రయ సిబ్బంది కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరూ సామాజిక దూరం పాటించేలా చర్యలు తీసుకుని, హ్యాండ్స్ శానిటేషన్, థర్మల్ స్క్రీనింగ్ చేశారు.

## ఏపీలో ఐదుగురు ఐఏఎస్ అధికారులకు జైలు శిక్ష

అమరావతి: ఐదుగురు ఐఏఎస్ అధికారులకు జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ ఏపీ హైకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. జైలు శిక్షపై అప్పీలుకు వెళ్లేందుకు నెల రోజుల పాటు శిక్షను సస్పెండ్ చేసింది. నెల్లూరు జిల్లాకు చెందిన తాళ్లపాక సాయి బ్రహ్మ అనే వ్యక్తికి నష్టపరిహారం చెల్లించకపోవటంపై హైకోర్టు సీరియస్ అయ్యింది. కోర్టు ఆదేశించినప్పటికీ సాయి బ్రహ్మకు న్యాయం చేయకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. మాజీ ఐఏఎస్ అధికారి మన్మోహన్ సింగ్‌కు నెల రోజుల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించింది. అప్పటి నెల్లూరు కలెక్టర్ శేషగిరిరావుకు 2 వారాల జైలు శిక్ష, జరిమానా విధించింది. ఐఏఎస్ అధికారి రావత్‌కు నెల రోజుల జైలు శిక్ష, వేయి రూపాయల జరిమానా, ముత్యాల రాజుకు రెండు వారాల జైలు శిక్ష, జరిమానా, ఏఎంబీ ఇంతియాజ్‌కు రెండు వారాల జైలు శిక్ష, జరిమానా విధించింది. అధికారుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేసి పిటిషనర్‌కు ఇవ్వాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.




## వైఎస్సార్ ఘాట్ వద్ద సీఎం వైఎస్ జగన్ ఘన నివాళి



ఇడుపులపాయ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్రెడ్డికి ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్ ఘనంగా నివాళులర్పించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి 12 వ వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సీఎం వైఎస్ జగన్, ఆయన సతీమణి వైఎస్ భారతిరెడ్డి, తల్లి వైఎస్ విజయమ్మ, సోదరి వైఎస్ షర్మిల, దివంగత వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, వైఎస్ కుటుంబ సభ్యులు వైఎస్సార్ ఘాట్ వద్ద పూలమాలలు ఉంచి అంజలి

### ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న వైఎస్ కుటుంబ సభ్యులు



ఘటించారు. డిప్యూటీ సీఎంలు ఎస్బీ అంజాద్ బాషా, నారాయణ స్వామి, ఇంచార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీలు వైఎస్ అవినాష్ రెడ్డి, గోరంట్ల మాధవ్, గురుమూర్తి, ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి, ప్రభుత్వ విప్లు కొరముట్ల శ్రీనివాసులు, చెవిరెడ్డి భాస్కర్రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

## ఏపీలో కొత్తగా 1,378 కరోనా కేసులు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కరోనా కేసులు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. గడిచిన 24 గంటల్లో ఏపీలో 59,566 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 1,378 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. గత 24 గంటలలో కరోనా బారిన పడి 10 మంది మృత్యువాతపడ్డారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 13,877 కు చేరింది. గత 24 గంటల్లో 1,139 మంది కోవిడ్ నుంచి కోలుకుని క్షేమంగా డిశ్చార్జ్ అవ్వగా, ఇప్పటివరకు 19,88,101 మంది ఏపీలో డిశ్చార్జ్ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ గురువారం కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. ఏపీలో ప్రస్తుతం 14,702 కరోనా కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. దీంతో రాష్ట్రంలో పాజిటివ్ కేసుల సంఖ్య 20,16,680 కు చేరింది. ఏపీలో ఇప్పటి వరకు 2,67,45,035 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.



# సంపాదకీయం

శుక్రవారం 03 సెప్టెంబరు 2021

## ఇంట గెలవలేకపోతున్న బైడెన్

డొనాల్డ్ ట్రంప్ హయాంలో ఇంటా బయటా ఆయన చాలాదూకుడుగా ఉండేవారు. ఏ విషయంలో అయినా 'అమెరికా ఫస్ట్' అన్న నినాదంతో ముందుకు సాగేవారు. ఈ విధానం కొన్ని స్దందర్భాల్లో ఆయనకు ప్రతికూలతలు తెచ్చిపెట్టాయి. దేశీయంగా, అంతర్జాతీయంగా విమర్శలు వెల్లువెత్తాయి. అగ్రరాజ్య అధినతేగా ఉండాల్సిన సంయమనం, నిగ్రహం లేదన్న వాదన వినిపించింది. తన తొందరపాటు వల్ల వ్యక్తిగతంగా విమర్శలు ఎదుర్కొన్నారు. అంతర్జాతీయంగా అమెరికా నవ్వుల పాలైంది. ఎన్నికల్లో ట్రంప్ పరాజయానికి ఇదీ ఒక కారణం. అదే సమయంలో డెమొక్రటిక్ అభ్యర్థిగా బరిలోకి దిగిన జో బైడెన్ అనుభవం, నిగ్రహం, సంయమనం, ఆచితూచి వ్యవహరించే తీరును చూసి ప్రజలు ఆయనకు పట్టం కట్టారు. బరాక్ ఒబామా హయాంలో ఉపాధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో ఆయన తరఫున బైడెన్ విదేశీ వ్యహారాలను చక్కబెట్టేవారు. అంతర్జాతీయ వ్యవహారాలల్లో బైడెన్ నిపుణుడని డెమొక్రటిక్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రచారం చేసింది. ఈ అనుభవం అక్కరకు వస్తుందని గత ఏడాది నవంబరు లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఆయనకు పట్టం కట్టారు. ఈ ఏడాది జనవరి 20న అధికార పగ్గాలు చేపట్టిన బైడెన్ విదేశాంగ విధానానికి పదును పెట్టి అతంర్జాతీయంగా దేశ ప్రతిష్టను పెంచుతారని ప్రజలు భావించారు. ఈ దిశగా కొంతవరకు విజయం సాధించారు కూడా. అయితే అఫ్ఘాన్ వ్యవహారంలో బైడెన్ వ్యవహరించిన తీరుపై ఇంటా బయటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అఫ్ఘాన్ నుంచి దళాల ఉపసంహరణకు ముందు తరవాతా ఆయన వ్యవహరించిన తీరు అమెరికన్లకూ మింగుడుపడటం లేదు. ఇది జో బైడెన్ పరాజయంగా అంతర్జాతీయ మీడియా ఘోషిస్తోంది. ఆయన అచేతనంగా వ్యవహరించి ప్రపంచంలో దేశ పరువు, ప్రతిష్టలను మంటగలిపారని అమెరికా సమాజం ధ్వజమెత్తుతోంది. వియత్నాం యుద్ధంలో ఓటమితో అఫ్గాన్ పరిస్థితిని పోల్చిచూస్తోంది. దళాల విరమణ సంగతిని పక్కనపెడితే ముఖ్యంగా కాబూల్ విమానాశ్రయంలో చోటు చేసుకున్నబాంబు పేలుళ్ల ఘటనను బైడెన్ వైఫల్యానికి పరాకాష్టగా అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు పేర్కొంటున్నారు. తాలిబన్లను నియంత్రించలేక చేతులెత్తేశారని ధ్వజమెత్తుతున్నారు. తద్వారా అంతర్జాతీయంగా అమెరికా పేరు ప్రతిష్టలు మనక బారాయన్న వాదనను విమర్శకులు గట్టిగా వినిపిస్తున్నారు. వాస్తవానికి అఫ్ఘాన్ నుంచి బలగాల ఉపసంహరణ బైడెన్ తీసుకున్న నిర్ణయం కాదు. ట్రంప్ హయాంలోనే ఈ నిర్ణయం ఆమోదం పొందింది. అధ్యక్ష ఎన్నికల్లో ఇది చర్చనీయాంశం అయింది. ట్రంప్, బైడెన్ ఇద్దరూ దీని గురించి సవివరంగా ప్రస్తావించారు. కానీ బలగాల ఉపసంహరణ ప్రక్రియను బైడెన్ సమర్థంగా పర్యవేక్షించలేకపోయారు. ఈ ప్రక్రియలో గందరగోళం నెలకొంది. ముందుచూపూ కొరవడింది. బలగాలను ఉపసంహరించు కోవాలనుకున్న వెంటనే అఫ్ఘాన్ లోని తమ పౌరులను, అధికారులను, సైన్యాన్ని రప్పించేందుకు ప్రణాళిక కొరవడింది. ఇందుకోసం ప్రత్యేక మిషన్ చేపట్టడం కానీ, ఒక ప్రత్యేక అధికారిని నియమించడం గానీ చేయలేదు. అంతా దైవాధీనం అన్నట్లు వ్యవహారం నడిపారు. అష్రఫ్ ఘనీ నేతృత్వంలోని ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూల్చేసి తాలిబన్లు తమ చేతుల్లోకి పాలనా వ్యవస్థను తీసుకున్న సంగతి అందరికీ తెలిసిందే. తాజాగా ఆ దేశం నుంచి సైనిక బలగాలను అగ్రరాజ్యం అమెరికా వెనక్కు తీసుకున్నది. ఇక ఆ దేశంలో తాలిబన్లు ఏది చేసినా చెల్లే పరిస్థితులే కనిపిస్తున్నాయి. అయితే, తాలిబన్ల రాజ్యం మొదలైన తర్వాత ఆఫ్ఘనిస్తాన్‌లో రూల్స్ అన్ని కూడా ఒక్కొక్కటిగా మారిపోతున్నాయి. గతంలో మాదిరిగా కాకుండా భిన్నంగా వ్యవహరిస్తామని చెప్తూనే తాలిబన్లు ఆచరణలో ఇంకా క్రూరంగా వ్యవహరిస్తున్నారు. నిరసనకారులపై ఉక్కుపాదం మోపుతూ అణచి వేస్తున్నారు. మహిళలకు విద్యాబోధన విషయంలోనూ తాలిబన్ల నిర్ణయం యువతుల పాలిట శాపంగా మారేలా ఉంది. ఈ విషయమై ఆ దేశ విద్యావేత్తలు, సోషల్ వర్కర్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆఫ్ఘనిస్తాన్‌లో కో–ఎడ్యుకేషన్ విధానం నిషేధించారు. ఫలితంగా అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి చదువుకునే పరిస్థితులు ఇక ఉండబోవు. ఇక షరియా చట్టం ప్రకారం ఇప్పుడు ఆడపిల్లలకు చదువు చెప్పడానికి పురుషులను అనుమతించబోరు. మొత్తంగా ఆఫ్ఘన్ దేశంలో అన్ని పనులు షరియా చట్టం ప్రకారం జరుగుతాయని తేల్చి చెప్పారు. మొత్తంగా ఆఫ్ఘనిస్తాన్ దేశంలో ఇంకా క్రూరాతి క్రూరమైన పరిస్థితులు నెలకొని ఉంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే దేశం విడిచి చాలా మంది అనగా సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు ఇతరులు వెళ్లిపోయారు. తమ దేశంలో ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపోతే ఆఫ్ఘన్ దేశ తొలి మహిళా ఎంపీ ఆ దేశాన్ని విడిచిపెట్టినందుకుగాను భావోద్వేగానికి గురైంది. తమ దేశంలో ఇలాంటి పరిస్థితి వచ్చి, తాను కనీసం పిడికెడు మట్టిని తన వెంట తీసుకొచ్చే పరిస్థితి లేకపోవడం బాధాకరమని పేర్కొంది. ఆఫ్ఘనిస్తాన్ దేశం తాలిబన్ల వశమైన నాటి నుంచి మహిళల హక్కులు ప్రశ్నార్థకం కాగా, ఇప్పుడు హక్కుల ఊసెత్తే పరిస్థితులే లేవు. పాక్ సహకారంతోనే ఆఫ్ఘన్ తాలిబన్ల హస్తగతం.. పాప్‌స్టార్ కాతాలిబన్ల గత చరిత్ర తెలిసినప్పటికీ వారిని పూర్తిగా నమ్మడం పెద్ద పొరపాటు. ఊహించినదాని కంటే ముందే తాలిబన్లు అఫ్ఘాన్ ను కైవశం చేసుకుంటారని సామాన్యులు సైతం అంచనా వేశారు. కానీ బైడెన్ యంత్రాంగం ఈ విషయాన్ని పసిగట్టలేకపోయింది. తమ వైఫల్యం ఏమీ లేదని, అఫ్గాన్ సేనల చేతగానితనమే ఇందుకు కారణమన్న అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సూల్లివాన్ వాదనలో పస లేదు. అఫ్ఘాన్ సేనలు సరైనవయితే అమెరికాకు అక్కడేం పని అన్న ప్రశ్నకు సరైన జవాబు లేదు.

# అప్పుల కుప్పగా ఆంధ్ర




విజయవాడ, సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్)జగన్ అధికారంలోకి వచ్చి రెండేళ్ళు దాటింది. అయితే ఏపీలో సమస్యలు అన్నీ కూడా ఆయన పాలన కంటే ముందే ఉన్నాయి. ఆ మాటకు వస్తే ఆరు దశాబ్దాల ఉమ్మడి ఏపీలో పదమూడు జిల్లాల ఏపీ ఎలా ఉందో కూడా అంతా చర్చించాలి. ఇక విభజన తరువాత అయిదేళ్ల పాటు చంద్రబాబు పాలన చేశారు. అంతే కాదు 90 వేల కోట్ల అప్పులతో, పాతిక వేల కోట్ల రూపాయల రెవిన్యూ లోటుతో ఏపీ ఏర్పడింది అన్న సంగతి ఇక్కడ ఎవరూ మరువరాదు. మరి అలాంటిది ఇపుడు ఏపీని అప్పుల ఆంధ్రా అని అంతా అంటున్నారే. అసలు ఏపీ పుట్టిందే అప్పులతో అన్నది ఏడేళ్ళ వ్యవధిలోనే ఎలా మరచిపోతారు అన్నది ఆర్థిక మేధావుల మాట. చంద్రబాబు అయిదేళ్ళ పాలనలో నాలుగేళ్ళ పాటు కేంద్రంతో పొత్తు పెట్టుకుని ఉన్నారు. మరి ఆయన హయాంలో ఏపీకి కేంద్రం ఎంత ఇచ్చింది. ఆయన ఎన్ని అప్పులు చేశారు అన్నీ కూడా చూడాలి కదా. ఇక చంద్రబాబు దిగిపోయేనాటికి రెండున్నర లక్షల కోట్ల అప్పులు కొత్తగా చేశారని వైసీపీ అంటోంది. సరే వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పులు చేస్తోంది. అయితే వాటిని సంక్షేమ పథకాల పేరిట ప్రజలకు పంచుతోంది. ఈ డబ్బులు కళ్ళ ముందు కనిపిస్తున్నాయి. మరి గతంలో టీడీపీ చేసిన అప్పుల సంగతేంటి, అవి ఎక్కడ ఖర్చు చేశారు అని జగన్ పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇక బీజేపీ తీసుకుంటే ఈ మధ్య సౌండ్ బాగా చేస్తోంది. జగన్ ని రాజకీయంగా కొట్టడం కష్టమని భావించి ఏపీలోని ఆర్థిక రంగం మీద పడ్డారు అన్న కామెంట్స్ ఉన్నాయి. జగన్ పథకాలను అమలు చేయడం వల్ల రాజకీయంగా బలంగా మారుతున్నారని, ఆయన ఆయువు పట్టుని నొక్కేయాలి అంటే ఆర్థికంగా దెబ్బ తీయాలన్నది బీజేపీ హిడెన్ అజెండాగా ఉందని అంటున్నారు. ఈ మధ్య బీజేపీ టోన్ కూడా టీడీపీ మాదిరిగా మారుతోందని కూడా అనుమానిస్తున్న వారున్నారు. ఏపీని అప్పుల ఆంధ్రా అంటున్న ఎంపీ, తెలుగు వాడు అయిన జీవీఎల్ నరసింహారావుకు ఆ అప్పులు ఎక్కడ నుంచి వచ్చాయో తెలియదా అని వైసీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. లక్షల కోట్లు నాడు చంద్రబాబు అప్పులుగా తెస్తే మాట్లాడని బీజేపీ పెద్దలు ఇపుడు రెండేళ్ళు కూడా కాకుండానే జగన్ సర్కార్ మీద గుండెలు బాదుకోవడం పచ్చి రాజకీయమే అంటున్నారు. ఏపీకి రెవిన్యూ లోటుగా పాతిక వేల కోట్లు రావాలి. కానీ ఏడేళ్ళుగా కేంద్రం ఇచ్చినది ఎంత అని లెక్క తీస్తే గట్టిగా నాలుగు వేల కోట్లుగా కూడా లేవు. మరి కేంద్రం విభజన చట్టం మేరకు ఆ నిధులు వెంటనే ఇవ్వాలిగా అంటున్నారు. అదే విధంగా తెలంగాణాలో ఉమ్మడి ఏపీ ఆస్తులు ఉన్నాయి. వాటి లెక్క తేల్చి ఏపీకి రావాల్సిన దాన్ని కేంద్రం ఇప్పించే ప్రయత్నం చేసిందా అంటే జవాబు లేదు. ఇలా రెండువందలకు పైగా విలువైన భవనాలు, ఆస్తులు తెలంగాణాలో ఉన్నాయి. మరో వైపు చూస్తే తెలంగాణా ఏపీకి కట్టాల్సిన విద్యుత్ బకాయిలు ఆరు వేల కోట్లకు పైగా ఉన్నాయి. వాటి విషయంలో ఇప్పించే సీన్ ఉందా అంటే లేదు అనే చెప్పాలి. ఇక ఏపీ విభజిత రాష్ట్రం, రాజధాని లేదు, అడ్డగోలు విభజనతో దారుణంగా నష్టపోయింది. మరి ప్రత్యేక హోదా ఇచ్చి నిలబెట్టారా అంటే కేంద్రం వద్ద జవాబు లేదు. కానీ అప్పులు చేస్తున్నారు అని జగన్ మీద నింద వేయడానికి బీజేపీ నేతలు తయారవుతారు అన్నది వైసీపీ నేతల ఆవేదనగా ఉంది. ఇక కరోనా దెబ్బకు దేశంలో ఏ రాష్ట్రం అప్పులు చేయకుండా ఉందని కూడా మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి ప్రశ్నిస్తున్నారు. ఏకంగా కేంద్రమే అప్పులు ఇబ్బడి ముబ్బడిగా చేయడమే కాదు ప్రభుత్వ ఆస్తులను కూడా తెగనమ్ముతూంటే బీజేపీ నేతలు మాత్రం ఏపీకే సుద్దులు చెబుతున్నారు అంటే ఎవరికైనా మండదు మరి.

# అవంతి శ్రీనివాసరావులో కలవరం



విశాఖపట్టణం, సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్)ఆయన టీడీపీ కంచుకోటను బద్దలు కొట్టారు. ఒకసారి కాదు రెండు సార్లు. దాంతో ధీమా పెరిగింది. ముచ్చటగా మూడవసారి గెలుపు సాధిస్తే తనకే ఆ సీటు శాశ్వతంగా దఖలు పడిపోతుందని భావిస్తున్నారు. ఆ సీటు భీమిలీ అయితే ఆయన గారే మంత్రి అవంతి శ్రీనివాసరావు. ఆయన 2019 ఎన్నికల్లో కేవలం తొమ్మిది వేల ఓట్ల మెజారిటీతో మాత్రమే గెలిచారు. ఆయన మీద పోటీ చేసిన దివంగత నేత సబ్బం హరి ఏకంగా 91 వేల ఓట్లను తెచ్చుకున్నారు. అంటే కాస్తా కష్టపడితే సబ్బం హరి గెలిచేసేవారే. నిజానికి అవంతి శ్రీనివాసరావు నాన్ లోకల్ అయితే సబ్బం హరి కూడా భీమిలీలో ఎపుడూ ఉన్నది లేదు. కానీ ఆయనకు అన్ని ఓట్లు వచ్చాయి అంటే అది భీమిలీలో టీడీపీకి ఉన్న పట్టుని తెలియచేస్తోంది. పెద్దగా మెజారిటీ రాకపోయినా అవంతి శ్రీనివాసరావుకి ఇచ్చిన మాట ప్రకారం జగన్ మంత్రిని చేశారు. కొద్ది నెలలలో ఆయన రెండున్నరేళ్ల మంత్రి కాబోతున్నారు. ఇంతదాకా ఆయన భీమిలీకి ఏం చేశారు అన్నది పక్కన పెడితే ఆయన ఇక మీదట తనదైన రాజకీయం చూసుకుంటారని అంటున్నారు. మళ్ళీ వచ్చే ఎన్నికల్లో ఇక్కడ నుంచి గెలవాలి అంటే కనుక వైసీపీని పటిష్టం చేసుకోవాలి. ఈ మధ్య జరిగిన లోకల్ బాడీ ఎన్నికల్లో కూడా పూర్తి విజయాలు పార్టీకి దక్కలేదు. సగానికి సగం టీడీపీ గెలిచి సత్తా చాటింది. దాంతో అవంతి శ్రీనివాసరావులో కలవరం బయల్దేరింది. టీడీపీని తగ్గిస్తేనే కానీ తాను గెలిచేది లేదన్నది కూడా బోధపడింది. మరో వైపు చూస్తే సబ్బం హరి చనిపోయేవరకూ భీమిలీకి ఇంచార్జిగా ఉండేవారు. ఆయన ఒక పెద్ద దిక్కుగా పార్టీకి ఉన్నారు. ఆయన పోయాక మాత్రం పార్టీలో లుకలుకలు ఒక్కసారిగా బయటపడిపోతున్నాయి. ప్రతీ వారూ ఎమ్మెల్యే అభ్యర్ధులుగానే ఫీల్ అవుతున్నారు. తమకే వచ్చే ఎన్నికల్లో టికెట్ కావాలని పేచీ పెడుతున్నారు. ఇక టీడీపీ అధినాయకత్వం ఆనందపురం మండలానికి చెందిన మాజీ ఎంపీపీ కోరాడ రాజబాబుని తెచ్చి భీమిలీ ఇంచార్జిని చేసింది. ఆయనకు పదవి ఇవ్వడమేంటి అని అటు సింహాచలం నుంచి ఇటు భీమిలీ దాకా తమ్ముళ్ళ అసంతృప్తి దావాలనంలా వ్యాపించింది. దాన్ని సరిచేసే పనిలో హై కమాండ్ సతమతమవుతోంది. సరిగ్గా దీన్నే అవంతి శ్రీనివాసరావు చాన్స్ గా తీసుకుంటున్నారు. తెలుగుదేశంలో వచ్చిన విభేదాలనే వాడుకుంటూ వైసీపీని బలోపేతం చేయడానికి రెడీ అవుతున్నారు. అవంతి శ్రీనివాసరావు ఇపుడు అర్జంటుగా చేస్తున్న పని ఏంటి అంటే టీడీపీ అసమ్మతి వాదులను గుర్తించి ఫ్యాన్ నీడకు చేర్చడం. ఆ విధంగా టీడీపీ ఇంచార్జి సొంత ఇలాకా ఆనందపురంలోనే పెద్ద ఎత్తున కీలకనేతలను తెచ్చి చేర్చుకున్నారు. భీమిలీలోనూ ఇదే ఆపరేషన్ ని స్టార్ట్ చేశారు. అవంతి శ్రీనివాసరావు అయిదేళ్ల పాటు టీడీపీలో ఉన్నారు కాబట్టి పాత పరిచయాలను ఉపయోగించుకుని మరీ ఇలా తమ్ముళ్ళను ఆకర్షిస్తున్నారు. ఇది కనుక వర్కౌట్ అయితే 2024లో మరో మారు అవంతి గెలుస్తారు. కానీ వారి రాకతో వైసీపీలో ఉన్న వారు కూడా అభద్రతకు గురి అవుతున్నారు. దాంతో అందరినీ బ్యాలన్స్ చేసుకుంటూ మంత్రి రాజకీయం చేయాల్సి ఉంది. మరో వైపు చూస్తే మంత్రి పదవి ఉంది కాబట్టి ఆపరేషన్ ఆకర్ష్ సక్సెస్ అవుతోంది. రేపటి రోజున ఆయన మాజీ మంత్రి అయితే టీడీపీకి రివర్స్ లో నేతల వలస ఉంటుందని తమ్ముళ్ళు అంటున్నారు. చూడాలి మరి అవంతి శ్రీనివాసరావు మూడవసారి ఎమ్మెల్యే ముచ్చట తీరుతుందో లేదో.

# పుష్ప శ్రీ వాణికి తప్పని ఇంటిపోరు



విజయనగరం, సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్)ఆమె అంత అదృష్టవంతురాలు వేరే ఎవరూ లేరు అనే చెప్పాలి. తూర్పు గోదావరి జిల్లాలో ఒక సాధారణ టీచర్ గా ఉన్న ఆమె ఈ రోజు ఏపీకి ఉప ముఖ్యమంత్రి. ఆమె పాముల పుష్ప శ్రీవాణి. ఆమెకు రాజకీయ నేపధ్యం ఏమీ లేదు. ఆమెను కురుపాం రాజ వారసుడు పరీక్షిత్ రాజు వివాహం చేసుకున్న మీదటనే లక్ అలా నక్కను తొక్కేసింది. ఇక 2014 ఎన్నికల వేళ పాముల పుష్ప శ్రీవాణికి టికెట్ ఇస్తే గెలిచి వచ్చారు. అంతే కాదు నాడు టీడీపీ ఎన్ని ప్రలోభాలు పెట్టినా కూడా ఆమె లొంగకుండా అయిదేళ్ళూ జగన్ తోనే నిలిచారు. ఫలితంగా జగన్ ఆమెకు 2019 ఎన్నికల్లో రెండవ సారి టికెట్ ఇచ్చారు. ఆమె గెలిచాక ఏకంగా ఉప ముఖ్యమంత్రినే చేశారు. జగన్ ఆప్యాయంగా చెల్లెమ్మ అని పిలిచే వారిలో ఆమె ముందు వరసలో ఉంటారు. పాముల పుష్ప శ్రీవాణికి రాజకీయం కొత్త. భర్త పరీక్షిత్ రాజు కూడా పెద్దగా ఆరితేరిన వారు కాదు. ఆయన తండ్రి శత్రుచర్ల చంద్రశేఖర రాజుకు రాజకీయంగా విశేష అనుభవం ఉంది. కానీ ఆయనను ఈ దంపతులు దూరం పెట్టారో ఆయన దూరం అయ్యారో తెలియదు కానీ ఇపుడు గట్టి పట్టున్న శత్రుచర్ల ఫ్యామిలీయే పుష్పకు అసలైన శత్రువు అయింది. అంటే ఇంట్లో పోరాడుతూ బయట ప్రత్యర్ధులతో కూడా తలపడాలి. నిజానికి ఇది కష్టమైన పని. అందుకే పాముల పుష్ప శ్రీవాణి ఈ ఫీట్ లో డిఫీట్ అయ్యారనే అంటున్నారు. కురుపాం లో రెండు సార్లు గెలిచిన పాముల పుష్ప శ్రీవాణికి ఈసారి చుక్కలు కనిపించడం ఖాయమనే మాట ఉంది. గిరిజన శాఖా మంత్రిగా పుష్ప శ్రీవాణి కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నా ఇప్పటిదాకా అరకు లోక్ సభ పరిధిలో ఉన్న ఏడు గిరిజన నియోజకవర్గాలలో పర్యటించిన దాఖలాలు లేవు. అంతే కాదు ప్రభుత్వ పథకాల మీద వారికి అవగాహన కల్పించి మన్యం జనం పూర్తి ప్రయోజనం పొందేలా చర్యలు తీసుకున్నారా అన్నది కూడా ప్రశ్నగానే ఉంది. మరో వైపు ఆమె రాజకీయంగా యాక్టివ్ గా ఉండడంలేదు అన్న మాట ఉంది. భర్త పరీక్షిత్ రాజు జోక్యం కూడా పెరిగింది. మరో వైపు వైసీపీలోని ఇతర నాయకుల రాజకీయం కూడా ఆమెకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. పాముల పుష్ప శ్రీవాణి వాటిని ధీటుగా ఎదుర్కోలేక తరచూ కన్నీళ్ళు పెట్టుకుంటున్నారు. అయితే రాజకీయాలలో ధీరత్వమే తప్పు బీరువుగా నిలిచే కుదిరేది కాదు. దానికి తోడు తాజాగా వచ్చిన ఒక సర్వేలో కురుపాం లో ఈసారి పుష్ప శ్రీవాణి ఓటమి ఖాయమని చెబుతోంది. దానితో పాటే మంత్రి పదవి కూడా ఊడుతుంది అంటున్నారు. పుష్ప శ్రీవాణి ఏదీ కావాలని అనుకుంటే వచ్చినవి కావు. ఆమె కంటే ఎందరో సీనియర్లు ఉండగా కేవలం ముప్పయ్యేళ్ళకే ఉప ముఖ్యమంత్రి అయిపోయారు. దాంతో ఆమె లక్ నే మళ్ళీ మళ్లీ నమ్ముకుంటున్నారు. జగన్ తన పట్ల అభిమానం చూపించి అయిదేళ్ళ పాటు మంత్రిగా ఉంచుతారని ఆమె ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆయన చెల్లెమ్మకు అన్యాయం చేయరని కూడా నమ్ముతున్నారు. ఒక వేళ మంత్రి పదవి కనుక చేతిలో ఉంటే వచ్చే ఎన్నికల్లో టికెట్ ఖాయమని, మంత్రి హోదాలో పోరాడితే గెలుపు కూడా సాధ్యమేనని ఆమె అంచనా కడుతున్నారుట. మరి తిరిగి తిరిగి అంతా లక్ మీదనే ఆధారపడి ఉంది. ఇప్పటికి రెండు సార్లు ఫేవర్ చేసిన లక్ మూడవసారి కూడా ఈ చెల్లెమ్మను వరిస్తే ఆమెకు ఇక తిరుగులేనట్లే

# కండువా మార్చిన..లేని అతీగతీ

విశాఖపట్టణం, సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్)వైసీపీలోకి వెళ్ళిన టీడీపీ నేతల పరిస్థితి హ్యాపీగా ఏమీ లేదు. వారు ఏదో జరుగుతుంది అనుకున్నారు. కానీ మరేదోలా పరిస్థితి తయారైంది. కనీసం నామినేటెడ్ పోస్టులు అయినా దక్కుతాయి అనుకుంటే వాటిని తీసుకెళ్ళి తమ పార్టీ వారికే పంచుకున్నారు. దాంతో ఇక ఎమ్మెల్యే టికెట్లు కోసమే ఆశ పెట్టుకోవాలి. అయితే అవి దక్కవని, ఇచ్చినా కోరిన చోట రావని ముందస్తు అంచనాలు ఉన్న వారు తిరిగి టీడీపీ వైపు చూస్తున్నారుట. అలాంటి వారిలో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన విశాఖ టీడీపీ జిల్లా మాజీ ప్రెసిడెంట్ పంచకర్ల రమేష్ బాబు ఒకరు. ఆయన ఇపుడు తన ఫ్యూచర్ పాలిటిక్స్ మీద తెగ కలవరపడుతున్నారు. నిజానికి రమేష్ బాబు యువకుడు, బలమైన కాపుసామాజిక వర్గానికి చెందిన వారు. ఆయన 2009 ఎన్నికల్లో తొలిసారి ప్రజారాజ్యం పార్టీ నుంచి పెందుర్తిలో మంచి మెజారిటీతో గెలిచారు. ఆ తరువాత ఆయన తన రాజకీయ గురువు గంటాతో పాటు టీడీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి పెందుర్తి టికెట్ కోరుకున్నా ఆయన్ని తీసుకెళ్ళి రూరల్ జిల్లా ఎలమంచిలికి షిఫ్ట్ చేశారు. దాంతో నాడు మొదలైన అసంతృప్తి కాస్తా 2019లో పార్టీ ఓడిన తరువాత బయటపడింది. ఈ నేపధ్యంలో వైసీపీ నుంచి కూడా రాయబారాలు నడవడంతో ఆయన వైసీపీలో చేరారు. చేరి రెండేళ్ళు అవుతున్నా ఎలాంటి ప్రయారిటీ లేదని, మూలన కూర్చోబెట్టేశారని రమేష్ బాబు మధన పడుతున్నారు. నిజానికి రమేష్ బాబుకు మొదటి నుంచి విశాఖ నార్త్ మీద మోజు ఉంది. ఆయన నివాసం ఉండేది కూడా అక్కడే. టీడీపీలో ఆ సీటు ఒకసారి పొత్తు రూపంలో పోతే మరోసారి ఏకంగా గంటా శ్రీనివాసరావు పోటీ చేయడంతో వదులుకోవాల్సి వచ్చింది. ఇక వైసీపీలో సైతం ఆయన ఇదే సీటు కోసం పట్టుపడుతున్నారు. అయితే జగన్ కి అత్యంత సన్నిహితుడుగా ఉన్న కె కె రాజు 2024 ఎన్నికల్లో ఇక్కడ నుంచి మరోసారి పోటీ చేయడం ఖాయమైంది. దాంతో విశాఖ ఉత్తరం మీద ఎవరు ఆశలుపెట్టుకున్నా కుదిరే వ్యవహారం కాదు. పోనీ పెందుర్తి సీటు ఇస్తారా అంటే అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్ రాజ్ ఉన్నారు. దాంతో రమేష్ బాబుకు టికెట్ మీద పక్కా క్లారిటీ అయితే వచ్చేసిందట. మరో వైపు టీడీపీలోకి పంచకర్ల రమేష్ బాబు రావడానికి కూడా ఇదే సీటు మెలిక ఉంది. వచ్చే ఎన్నికల్లో టీడీపీ బీజేపీతో పొత్తు పెట్టుకుంటే ఈ సీటు బీజేపీకి పోతుంది. దాంతో టీడీపీలోకి వచ్చినా సుఖం లేదు. అయితే పెందుర్తి సీటు ఇచ్చేందుకు మాత్రం టీడీపీ నుంచి హామీ ఉన్నట్లుగా చెబుతున్నారు. 2009 ఎన్నికల్లో రమేష్ బాబు గెలిచిన సీటు కూడా కావడంతో ఆయన వైపు మొగ్గు చూపవచ్చు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణ ఫ్యామిలీని దూరం పెట్టాలని చంద్రబాబు భావిస్తున్నందువల్ల అక్కడ ఖాళీ ఉండే చాన్స్ ఉంది. దాంతో అయితే విశాఖ నార్త్ లేకపోతే పెందుర్తి సీటు అన్న గ్యారంటీతో రమేష్ బాబు టీడీపీలోకి జంప్ చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. మొత్తానికి ఇదే తీరున మిగిలిన నేతలు కూడా తమ దారి తాము చూసుకుంటే వైసీపీ సంగతి ఏమో కానీ టీడీపీలో కొత్త గొడవలు వస్తాయా అన్న చర్చ కూడా ఉంది మరి.

# ఉక్కు కోసం ఆదానీ... టాటా

విజయవాడ, సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్)విశాఖ ఉక్కు కర్మాగారం. ఆంధ్రుల హక్కు. ఏళ్లకు ఏళ్ళు పోరాడి సాధించుకున్న ప్లాంట్. దేశంలోనే సాగర తీరన వెలసిన ఒకే ఒక పరిశ్రమ. ఇపుడు అంగట్లో సరుకైంది. ఇవాళ కాదు ఆరు నెలల క్రితమే దాన్ని అమ్మకానికి పెట్టేశారు. నాటి నుంచి ఉక్కు కార్మికులు ఉద్యమిస్తున్నారు. వారు తమ శక్తిమేరకు గల్లీ టూ ఢిల్లీ దాకా ఉక్కు సెగను రగిలించగలిగారు. కానీ చెవిటివారి ముందు శంఖం ఎంత గట్టిగా ఊదినా ప్రయోజనం లేదు. అందుకే విశాఖ స్టీల్ ప్లాంట్ బలి పీఠం మీదనే ఉంది. అక్షరాలా ఇది నిజం. నమ్మకపోతే కొనేందుకు పోటీ పడుతున్న దిగ్గజ పారిశ్రామికవేత్తల ప్రకటనలను చూసి అయినా నమ్మి తీరాలి. టాటాకు దేశంలో పెద్ద పారిశ్రామికవేత్తగా పేరుంది. గతంలో టాటా బిర్లాలు అనేవారు. ఇపుడు నవీన తరంలో అంబానీ అదానీలు దూసుకువచ్చారు. సరే ఎవరైనా కూడా కథ మామూలే. దేశంలో దిగ్గజ పారిశ్రామికవేత్తలతో పాలకులు ఎపుడూ అంటకాగుతూనే ఉంటారు. వారి పంటను పండిస్తూనే ఉంటారు. నాటి పాలకులకు టాటాలు, బిర్లాలు తెగ నచ్చితే ఇపుడు అంబానీలు, అదానీల మీద మోజు పెరిగింది. ఏ రాయి అయితేనేం పళ్ళూడగొట్టుకోవడానికి అన్నట్లుగా ప్రభుత్వ రంగం కున్నారిల్లి ప్రైవేట్ బాట పడుతున్నపుడు విశాఖ స్టీల్ ప్లాంట్ ను ఎవరు కొంటేనేంటి. ఎవరు కొత్త పెత్తందారు అయితేనేంటి అన్నదే కార్మిక లోకం వైరాగ్యం. నిజానికి విశాఖ స్టీల్ ప్లాంట్ ని అదానీలకే అప్పగిస్తారన్న ప్రచారం అయితే గట్టిగా సాగింది. దాని కోసమే అన్నట్లుగా పక్కనే ఉన్న గంగవరం పోర్టుని కూడా కొనేసి అదానీ అపుడే సర్వం సిద్ధం చేసుకున్నారని టాక్. పొయ్యి కాడ ఆకు మడి లెక్కన విశాఖ స్టీల్ ప్లాంట్ ని కూడా తీసుకుంటే పోర్టు ద్వారా ట్రాన్స్ పోర్ట్ కి ఏ రకమైన ఇబ్బందులు ఉండవని కూడా ముందు చూపు. దానికి తోడు కేంద్ర పెద్దలకు అదానీ బాగా సన్నిహితుడు అని కూడా చెబుతారు. ఇక ఏపీ పాలకులకు కూడా అదానీ బాగా కావాల్సిన వాడే. దాంతో అదానీకే విశాఖ స్టీల్ ప్లాంట్ రాసి ఇచ్చేస్తారు అన్నది నిజం అనుకుంటున్న వేళ సడెన్ గా టాటా ఎంట్రీ ఇచ్చారు. తానే కొంటాను అంటూ సంచలన ప్రకటన చేశారు. దాంతో ఇపుడు స్టీల్ ప్లాంట్ కి కొత్త కొనుగోలుదారు పోటీగా వచ్చారు అంటున్నారు. టాటా స్టీల్ ప్లాంట్ సీఈఓ తాము విశాఖ స్టీల్ ప్లాంట్ కొనడానికి కారణాలు కొంత చెప్పేశారు. సాగర తీరంలో ఉన్న ఏకైక పోర్టు. పోర్ట్ రవాణా కడు సులభం. అంతే కాదు, 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన అతి పెద్ద ఉక్కు పరిశ్రమ. ఇలాంటి ప్లస్ పాయింట్లు చాలానే ఉన్నాయని టాటా చెబుతూంటే విశాఖ జనాలు బాధ పడాల్సిందే. ఇంత చక్కని పరిశ్రమను నష్టాల పేరు చెప్పి తెగనమ్ముతారా అని కార్మిక లోకం కూడా కుములుతోంది. అయినా సరే కేంద్రం మొండిగా ఉంది. అమ్మడం ఖాయం. అది టాటాకా. అదానీకా అన్నది ప్రశ్న కాదు, ఎవరైనా కూడా విశాఖలోని స్టీల్ ప్లాంట్ పెద్ద టాటా చెప్పేస్తోంది. బీజేపీ వారి మాటల్లో అయితే విశాఖ స్టీల్ ప్లాంట్ ఎక్కడికీ పోదు అక్కడే ఉంటుంది. కానీ అది మనది కాదు అన్న భావనతోనే ప్రజలు ఎప్పటికీ ఉంటారు. అలా వారు తమ మనసులో కూడా ప్లాంట్ తో అనుబంధానికి టాటా చెప్పేస్తారు. అలా ఈ కథను ముగించేయడానికి తెర వెనక చకచకా పావులు కదులుతున్నాయి.

# నెల్లూరు లో జోరు వాన

నెల్లూరు సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్) నెల్లూరు జిల్లాలో వాన దంచికొడుతుంది. రోడ్ల పై వర్షపు నీరు పొంగిపోర్లుతుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ఉదయం నుంచి ఓ మోస్తరు వర్షం పడుతుంది. జిల్లా కేంద్రంలోని బాలాజీ నగర్, పొదలకూరు రోడ్డు, అయ్యప్ప గుడి, పడారుపల్లి, ఆత్మకూరు బస్టాండ్ నవాబుపేట తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. చిన్నపాటి వర్షానికి నెల్లూరు నగరంలో డ్రైనేజీ కాలవలు నిండిపోయాయి. వర్షం తో నెల్లూరు నగరంలో చిరువ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.

# టీడీపీలో సీటు రఘురామకు రిజర్వ్...

ఏలూరు, సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్)టీడీపీలో ఒక చర్చ సాగుతోంది. ఒక నియోజకవర్గాన్ని చంద్రబాబు వచ్చే ఎన్నికల కోసం .. ఓ కీలక నాయకుడికి రిజర్వ్ చేశారని అంటున్నారు. ఆ నియోజకవర్గాన్నిఆయనకు తప్ప ఎవరికీ కేటాయించే అవకాశం లేదని టీడీపీ నేతలు చర్చించుకుంటున్నారు. ఎవరు ఎన్ని విధాలా ప్రయత్నం చేసినా.. సదరు నియోజకవర్గం జోలికి మాత్రం పోవద్దని.. టీడీపీ నేతలకు.. చంద్రబాబు మౌఖిక ఉత్తర్వులు కూడా ఇచ్చారని.. అంటున్నారు. అంటే.. ప్రస్తుతం వైసీపీ నేత.. ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో అభివృద్ధి సాగడం లేదని.. నియోజకవర్గాన్ని పట్టించుకోవడం లేదని.. వంటి విమర్శలు చేయొద్దని.. చంద్రబాబు సూటిగా చెప్పారని అంటున్నారు.దీంతో ఆ నియోజకవర్గాన్ని దాదాపు ఇప్పుడు టీడీపీ నేతలు ఎవరూ టచ్ చేయడం లేదు. దీంతో అది ఆ వైసీపీ నేతకు రిజర్వ్ అయినట్టేననే చర్చ జోరుగా సాగుతోంది. కొన్నాళ్లుగా వైసీపీలోనే ఉంటూ.. ఆ పార్టీపై విమర్శలు చేస్తున్న ఎంపీ రఘురామకృష్ణ రాజు.. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం పార్లమెంటు స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇప్పటికే.. ఈయనను వైసీపీ వాళ్లు పక్కన పెట్టారు వ్యూహాత్మకంగా.. ఆయనపై అనర్హత వేటు వేయించాలని చూస్తున్నా ఇది వర్కవుట్ కావడం లేదు. అయితే.. మరో రెండున్నరేళ్ల సమయం ఉంది కనుక అనర్హత వేటు పడితే.. ఆరేళ్ల వరకు ఏ పార్టీ తరఫునా ఆయన పోటీ చేసే అవకాశం ఉండదు.ఇది జరిగితే.. వైసీపీకి మేలు. అయితే.. అలా జరగని పక్షంలో మళ్లీ ఆయన పోటీకి దిగుతారు. అయితే.. ఈ దఫా వైసీపీ టికెట్ ఇవ్వదు కాబట్టి.. ఆయన టీడీపీ తరఫున పోటీ చేసేలా.. చంద్రబాబు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారని ఆ పార్టీ నేతల్లోనే చర్చ సాగుతోంది. జిల్లాకుచెందిన పార్టీ నాయకుల మధ్య ఇదే విషయం తరచూ చర్చకు వస్తోంది. ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు కూడా ఇదే విషయాన్ని ఓపెన్‌గానే చెపుతున్నారు. ఆ నియోజకవర్గం రఘురామకు రిజర్వ్ అయిందని.. దీనిని ఎవరికీ కేటాయించే పరిస్థితి లేదని వారు చెపుతున్నారు.దీనిపై తమకు చంద్రబాబు నుంచి చూచాయగా కొన్ని సందేశాలు కూడా వచ్చాయని కూడా జిల్లా పార్టీలో కీలక నేతలు చెపుతున్నారు. అయితే దీనిపై అధికారికంగా మాట్లాడేందుకు మాత్రం ఎవరూ ముందుకు రావడం లేదు. పైగా టీడీపీ నేతలు.. ఎవరూ కూడా నరసాపురం గురించి చెప్పడం లేదు. ఈ పరిణామాలతో .. ఆ నియోజకవర్గం వచ్చే ఎన్నికల్లో రఘురామకు దాదాపు ఫిక్స్ అయ్యిందనే అంటున్నారు. విచిత్రం ఏంటంటే గత ఎన్నికలకు ముందు వరకు ఆయన నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గానే ఉన్నారు

# ఒకరి నేత్రదానంతో ఇద్దరికి చూపు ప్రసాదించవచ్చు



నెల్లూరు సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్) స్థానిక ధనలక్ష్మి పురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 36 వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భముగా జిల్లా అంధత్వ నివారణా సంస్థ, ది పీఎంపీ అసోసియేషన్

**డా.యం మంజులమ్మ, ప్రోగ్రాం మేనేజర్**

ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నేత్రదానం పై అవగాహన సదస్సు జరిగింది. జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డా.యం మంజులమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరణానంతరం వారి కళ్ళు దానం చేస్తే, ఇద్దరికి చూపు ప్రసాదించవచ్చుని, పుట్టుకతో కొందరు, ప్రమాదంలో చూపు కోల్పోయి, మరి కొందరు, ఎంతో మంది సమాజంలో అంధులుగా మిగిలిపోతున్నారని, సమయానికి కార్నియా దొరకక శాశ్వితంగా లోకాన్ని చూసే భాగ్యాన్ని కోల్పోతున్నారని, సహృదయంతో ముందుకువస్తే చనిపోయినా మరో ఇద్దరికి కంటిచూపు ప్రసాదించే అవకాశం కలుగుతుందన్నారు. ప్రజల్లో మరింత చైతన్యం రావాలంటే నేత్రదానాన్ని ఒక కుటుంబ సంప్రదాయంగా మార్చుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే నేత్రదానం యొక్క ఆవశ్యకతను పెంపొందించుకొవాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థలు, పీఎంపీలు సహకారంతో జిల్లాలో పలుచోట్ల అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.ముఖ్యఅతిథిలుగా నారాయణ డెంటల్ కాలేజీ హెచ్ఓడి డా.కన్నన్, ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి ఎ. జయప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రదానమంటారని, అలాంటి నేత్రదానాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని, జిల్లా అంధత్వ నివారణా సంస్థతో కలిసి, పీఎంపీలు నేత్రదానంపై అవగాహన కల్పించడం ఎంతో అభినందనీయమన్నారు.36 వ నేత్రదాన పక్షతోత్సవాలు ఆగస్ట్ 25 నుండి సెప్టెంబర్ 8 వ తేదీ వరకు జరుగుతాయని, చనిపోయిన తరువాత వారి కళ్ళను దానం చేయడం వల్ల తిరిగి జీవించవచ్చుని తెలిపారు.ఈ కార్యక్రమంలో రూడ్స్ అధ్యక్షులు షేక్ రసూల్, జిల్లా పీఎంపీ అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, నాయకులు డి. శ్రీనివాసులు, పి.మోహన్, డి. సుధాకర్, పాఠశాల హెచ్ యం నారాయణ, యంయన్ఓ శివ గణేష్, ఐ డోనేషన్ కౌన్సిలర్ బాలాజీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకన్న భక్తులకు ధనప్రసాదం

తిరుమల సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్)తిరుమలలో హుండీ చిల్లర వదిలించుకునేందుకు టిటిడి మంచి స్కీం ఆలోచించింది. చిల్లర నాణేలను బ్యాంకులు తీసుకోకపోవడంతో , ధన ప్రసాదం పేరుతొ పూజా కుంకుమ కలిపి , వాటిని భక్తులకే అంటగట్టే పథకం ఆలోచించింది. గదులు బుక్ చేసుకున్న భక్తులకు తిరిగి ఇచ్చే కాషన్ డిపాజిట్ విధానంలో కొత్త స్కీం తీసుకొచ్చింది టిటిడి. శ్రీ వారి హుండిలో భక్తులు సమర్పించే చిల్లర నాణ్యాలను ధన ప్రసాదం పేరుతో గదులు ఖాళీ చేసే భక్తులకు అందిచే విధానాన్ని ప్రారంభించింది. ఈ మేరకు స్వామివారి గంధం, కుంకుమా, పసుపుతో కలిసి ప్యాక్ చేయబడ్డ 100, 200, 500, ప్యాకెట్లను ఉప సమాచార కార్యాలయాల్లో అందుబాటులో వుంచింది. తద్వారా హుండి పడే చిల్లర టిటిడి ఖజానాలో కాళీ అవ్వడంతో పాటు భక్తులకు ఓ ప్రసాదంలా అందుతుంది.

# ఒంగోలులులో పౌష్టికాహార వారోత్సవాలు

ఒంగోలు సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్)రాష్ట్రంలో మహిళా, శిశువుల ఆరోగ్యం కోసం పౌష్టికాహారం అందించ టానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణం, శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద జాతీయ పౌష్టికాహార వారోత్సవాల సందర్భంగా ర్యాలీని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి జెండా ఊపి.. ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బాలినేని మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా, శిశు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో జాతీయ పౌష్టికాహార వారోత్సవాలపై అవగాహన కల్పించటానికి ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు వారం రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహించటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రాష్ట్రంలో మహిళలు, శిశువులు పౌష్టికాహార వారోత్సవాలలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ర్యాలీ సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ను మంత్రి బాలినేని, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసు లురెడ్డి, కలెక్టర్ ప్రవీణ్కుమార్ తిలకించారు.

# సింహాచలంలో స్వర్ణపుష్పార్చన

విశాఖపట్నం సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్) శ్రీవరాహలక్ష్మి నృసింహ స్వామి వారికి స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం సంప్రదాయబద్ధంగా జరి గింది. అర్చకులు స్వామిని సుప్రభా తసేవతో మేల్కొలిపి ప్రభాతసేవలు నిర్వహించారు. ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను సర్వాంగ సుంద రంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింప జేశారు. అష్టోత్తర శతనామాలతో స్వామిని బంగారు సంపెంగలతో అర్చించారు. అనంతరం నిత్యకల్యాణోత్సవం కమనీయంగా జరిపారు. భక్తులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# మనసున్న మహారాజు వైఎస్సార్

విశాఖపట్నం సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్) వైఎస్సార్ మనసున్న మహారాజు అని ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. వైస్సార్ వర్ధంతి సందర్భంగా విశాఖలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. దివంగత మహానేత వైఎస్సార్ సుపరిపాలన అందించారన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితో ముందడుగు వేస్తున్నామన్నారు. తండ్రి బాటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి నడుస్తున్నారని తెలిపారు.ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగన్ నెరవేరుస్తున్నా రని, ఎక్కడా అవినీతికి తావులేకుండా పాలన చేస్తున్నారని చెప్పారు. పార్టీలో కష్టపడిన వారందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ భూములు ప్రజలకే చెందాలన్నది మా లక్ష్యంగా కొనసాగుతున్నామని తెలిపారు.

# అక్రమ మద్యం స్వాధీనం

నూజివీడు సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్)అక్రమంగా తెలంగాణా మద్యాన్ని తరలిస్తున్నారని నూజివీడు యస్.ఈ.బి ఇన్స్పెక్టర్ గోపాలకృష్ణ కు సమాచారం రావడంతో ఆయన తన యొక్క సిబ్బందితో నూజివీడు పట్టణంలోని బైపాస్ రోడ్డు వద్ద ముమ్మర తనిఖీలు చేపట్టారు.తెలంగాణ రాష్ట్రం ఖమ్మం నుండి ఆగిరిపల్లికి తెలంగాణ రాష్ట్ర అక్రమ మద్యం తరలిస్తుండగా నూజివీడు బైపాస్ రోడ్డు వద్ద మద్యం స్వాధీనం చేసుకుని మొత్తం 288 క్వార్టర్ సీసాలు మద్యం స్వాధీనం చేసుకుని మద్యం తరలిస్తున్న స్కార్పియో సీజ్ చేసి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసిన యస్.ఈ.బి ఇన్స్పెక్టర్ గోపాలకృష్ణ.ఈ అక్రమ మద్యం యొక్క విలువ తెలంగాణ రాష్ట్రంలో 48 వేల రూపాయలు ఉంటుందని మన రాష్ట్రంలో లక్ష రూపాయలు ఉంటుందని యస్.ఈ.బి ఇన్స్పెక్టర్ గోపాల్ కృష్ణా తెలిపారు.ఎవరైనా తెలంగాణ రాష్ట్ర మద్యం రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# మళ్లీ వెలుగులోకి ఈఎస్ఈ మందుల స్కామ్

గుంటూరు, సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్)ఇఎస్ఐలో మందుల స్కామ్ వెలుగులోకి వచ్చింది. ఉపయోగం లేని, కాలపరిమితికి మించిన మందులను తక్కువ ధరలకు కొనుగోలు చేసిన అధికారులు ఎక్కువ బిల్లులు పెట్టారు. ఇలా రెండేళ్ల కాలంలో రూ.50 కోట్లు విలువైన మందులను కొనుగోలు చేశారు. డిస్పెన్సరీల్లో కొంత కాలంగా ఈ మందులనే సరఫరా చేస్తున్నారు. గతంలో విజయవాడ కేంద్రంగా పనిచేసిన జెడిలు, ఫార్మాసిస్టు, సీనియర్ అసిస్టెంట్ల ఆధ్వర్యాన జరిగిన ఈ అవినీతి బయటకు రావడంతో ప్రభుత్వం ఆ మందులకు సంబంధించిన బిల్లులను నిలిపేసింది. ఈ నేపథ్యంలో పాత బిల్లులు చెల్లించకపోతే కొత్తగా ఇఎస్ఐకు మందులు సరఫరా చేయబోమని ఫార్మా కంపెనీలు మెలికపెట్టాయి. దీంతో డిస్పెన్సరీలలో మందులు చేరక రోగులు అవస్థలు పడుతున్నారు. రాష్ట్రంలో 70 డిస్పెన్సరీలున్నాయి. వీటికి ఏటా సుమారు రూ.30 కోట్ల నుంచి రూ.50 కోట్ల విలువైన మందులు అవసరం ఉంటుంది. అనారోగ్యానికి గురైన కార్మికులు, ఉద్యోగులు ఈ డిస్పెన్సరీలకు వెళ్లి ఉచితంగా మందులు తెచ్చుకుని వాడుతుంటారు. వీరికిచ్చే మందులు కొనుగోళ్లలో పెద్ద గోల్‌మాల్ జరిగింది. అవసరం లేని మందులను ఎక్కువ ధరకు కొనుగోలు చేశారు. జుట్టు రావడానికి వినియోగించే హెయిర్ ఫర్ యు మందు డిస్పెన్సరీలకు అవసరం లేదు. అయినా, 5 వేల బాటిల్స్‌ను కొనుగోలు చేశారు. ఒక్కో బాటిల్‌కు రూ.377 చెల్లించారు. వీటి కొనుగోలుకు రూ.18.85 లక్షలు చెల్లించారు. అలాగే డయాలసిస్ లిక్విడ్ ఆస్పత్రుల్లోనే ఇస్తారు. డిస్పెన్సరీలకు అవసరమని చెప్పి 2 వేల డయాలసిస్ ప్యాకెట్లను ఒక్కోదానికి రూ.500 చొప్పున రూ.పది లక్షలు చెల్లించి కొన్నారు. సుగర్ పేషెంట్లకు గాయం మాని చర్మం వచ్చేందుకు వాడే రెజెంట్-డి పూత మందు 17,272 బాటిల్స్‌ను కొన్నారు. ఒక్కోదానికి రూ.742 చొప్పున 1.13 కోట్లు చెల్లించారు. గుండె జబ్బు ఉన్నవారికి వాడే పాట్‌క్లర్ సిరప్ 24 వేల బాటిల్స్ కొన్నారు. ఒక్కో దానికి రూ.18 చొప్పున 4.32 లక్షల బిల్లులు పెట్టారు. కేన్సర్ పేషెంట్లకు వాడే టొఫోసినాబ్ మాత్రలు ఒక్కో బాక్సుకు రూ.400 చెల్లించి 9 వేల బాక్సులను రూ.36 లక్షలు పెట్టి కొన్నారు. ఇలా అవసరం లేని, లేదా తక్కువ అవసరమయ్యే మందులు పెద్ద సంఖ్యలో కొనుగోలు చేసి, కాలం దాటిన వరకూ ఉంచి తరువాత బయట పారేస్తున్నారు. డిస్పెన్సరీలకు ఇచ్చే సర్జికల్ కాటన్, క్రేప్ బ్యాండేజెస్, ఎల్ఎస్ బెల్ట్, నీ బ్రేస్ వంటివి సుమారు రూ.50 లక్షలు పెట్టి కొన్నారు. వీటిని వినియోగించాలంటే ఐడిన్ తప్పనిసరి.

డిస్పెన్సరీల్లో గత ఐదేళ్లుగా ఐడిన్ అందుబాటులో లేదు. అవసరమైన ఐడిన్ కొనకుండా మిగతా వాటికి డబ్బులు వృథా చేశారు. వాస్తవానికి కాటన్ ఒక బండిల్ ధర బయట రూ.80 ఉంటే ఫార్మా కంపెనీ దగ్గర రూ.250 చెల్లించి కొన్నారు. ఇలా అన్ని మందులనూ అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేసి అవినీతికి పాల్పడ్డారు.ఇఎస్ఐ ఎపిఎంఎస్ఐడిసి నుంచి మందులు కొనుగోలు చేయాలి. నిబంధనలకు విరుద్ధంగా రెడ్డీస్ ల్యాబ్, గ్లెన్ మార్క్, భారత్ బయోటెక్, అరబిందో వంటి ప్రైవేటు కంపెనీల దగ్గర కొనుగోలు చేస్తోంది.. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం బిల్లులను నిలుపుదల చేసింది. ఈ మేరకు 2015 నుంచి ఇప్పటి వరకూ ఈ కంపెనీలకు సుమారు రూ.250 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఫార్మా కంపెనీలు తమకు వెంటనే బిల్లులు చెల్లించాలని ఇఎస్ఐ ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. పైగా పాత బిల్లులు చెల్లిస్తే తప్ప కొత్తగా మందులు సరఫరా చేయబోమని బెదిరిస్తున్నాయి. దీంతో ప్రస్తుతం డిస్పెన్సరీల్లో ఉన్న మందులతోనే సిబ్బంది నెట్టుకొస్తున్నారు.

# డా.వై.ఎస్ సేవలు మరువలేనివి


పుంగనూరు,,సెప్టెంబర్ 2 దివంగత రాష్ట్ర ముఖ్య మంత్రి డా.వై.ఎస్.రాజ శేఖర రెడ్డి తన పాలనలో ప్రజల మన సులను గెలిచారని గౌ.రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.. గురువారం దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజ శేఖర్ రెడ్డి 12 వ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి,భూ గనులశాఖ మంత్రి పులిచెర్ల (మం) కల్లూరు, సదుం బస్టాండ్ వద్ద, సోమల మండల నాలుగు రోడ్ల కూడలి వద్ద,చౌడేపల్లి మండల కేంద్రం, పుంగనూరు పాత బస్ స్టాండ్ వద్ద, సుగాలి మిట్ట వద్ద డా.వై ఎస్.రాజ శేఖర్ రెడ్డి గారి విగ్రహాలకు పూల మాలలతో ఘనంగా నివాళులర్పించారు... పుంగనూరు పాత బస్ స్టాండ్ వద్ద డా.వై.ఎస్.రాజ శేఖర్ రెడ్డి విగ్రహాని కి మంత్రి వర్యుల తో పాటు గౌ.చిత్తూరు పార్లమెంట్ సభ్యులు ఎన్. రెడ్డప్ప, గౌ.రాష్ట్ర జానపద కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పుంగనూరు,కుప్పం,మదనపల్లె నగర అభివృద్ధి సంస్థ చైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్, బోయ కొండ గంగమ్మ తల్లి ఆలయ పాలక మండలి చైర్మన్ శంకర్ నారా యణ, పుంగనూరు మునిసిపల్ చైర్మన్ ఆలీమ్ భాష లతో ఘనంగా నివాళులు అర్పించారు... అనంతరం ఉచిత వస్త్రాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాన్ని మరియు రక్త దాన శిబిరం ను గౌ.మంత్రి వర్యులు ప్రారంభించారు... అనంతరం మంత్రి వర్యులు మాట్లాడు తూ దివంగత మహా నేత డా. వై.ఎస్.రాజ శేఖర్ రెడ్డి వారు చేసి న సేవలను ఎన్నటికీ ప్రజలు మరువ లేర న్నారు... వారు తీసు కొని వచ్చిన పథకాలు పేద ప్రజలందరికీ ఎంతో ఉపయోగ పడి వారి

**ఏ రాష్ట్రంలో లేని విధంగా ఫీజు రీయిం బేర్స్మెంట్, ఆరోగ్యశ్రీ పథకాలను తీసుకొని వచ్చిన ఘనత రాజశేఖర రెడ్డి గారిదే**

జీవితాల్లో వెలుగులు నింపా యన్నారు..ప్రధానంగా విద్య, వైద్య రంగాల లో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఫీజు రీ యిం బర్సుమెంట్, ఆరోగ్య శ్రీ పథకాలను తీసు కొని వచ్చిన ఘనత దివంగత ముఖ్య మంత్రి డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారిదే నన్నారు.దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు మరణించి 12 సంవ త్సరాలు అయినా ప్రజలు వారిని హృద యాలలో పెట్టుకొని పూజిస్తున్నారని , అం తటి గొప్ప నాయ కుడు

ఈ రాష్ట్రానికి లేకుండా పోవడం మన దురదృష్టమని , ఆయన బాధ్యతలను మన గౌ. ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి తీసు కొని పరిపాలన సాగి స్తున్నారని తెలిపారు.. పాదయాత్రలో చెప్పిన విషయాలను , మేని ఫెస్టో లో పెట్టిన అం శాలను ,పథకాలను పూర్తిగా అమలు చేస్తు న్న ఘనత గౌ.రాష్ట్ర ముఖ్య మంత్రి వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి కే దక్కుతుందన న్నారు... దివంగత ముఖ్యమంత్రి వై. ఎస్.రాజశేఖర రెడ్డి గారి జన్మ దినాన్ని మరియు వర్దంతిని ఇదే విధంగా ప్రతి సంవత్సరం జరుపు కోవాలని కోరారు. ఈకార్యక్రమాలలో మునిసిపల్ కమిషనర్ కె.ఎల్.వర్మ, నాయ కులు పెద్దిరెడ్డి,పోకల అశోక్ కుమార్,జయ చంద్రా రెడ్డి,మండల స్థాయి అధికారులు, నాయకులు అనది కారులు,తది తరులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# బడి బాట పట్టేశారు



హైదరాబాద్, సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్)గుళ్లు, మార్కెట్లు, సినిమా థియేటర్లు, షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాళ్లు సహా అన్నీ ఓపెన్ అయ్యాయి. ఒక్క బడి దగ్గరికొచ్చేసరికే చిక్కొచ్చిపడింది. స్కూళ్లు తెరవాలా లేదా అనే దానిపై కోర్టులో కేసూ పడింది. హైకోర్టు కొన్ని మినహాయింపులతో స్కూళ్ల రీ ఓపెన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకే ప్రభుత్వమూ మార్గదర్శకాలను విడుదల చేసింది. కోవిడ్-19 థర్డ్‌వేవ్ ముప్పు ఉందనే భయం ఒకవైపు, అది వస్తే చిన్న పిల్లలపైనే ప్రభావం ఎక్కువగా ఉంటుందనే భయాందోళనలు మరోవైపు వెరసి విద్యార్థుల భవిష్యత్‌నే గందరగోళంలోకి నెట్టేస్తున్నాయి. స్కూళ్లు తప్ప, అన్నీ ఓపెన్ చేసేశారు...పెద్దలు పనులకు వెళ్తున్నారు. పిల్లలతో ఫంక్షన్లకూ వెళ్తున్నారు. రాజకీయపార్టీల పాదయాత్రలూ, సభలు, సమావేశాలు కొనసాగుతున్నాయి. జనం గతంలో మాదిరి సాధారణ జీవనానికి అలవాటుపడుతున్నారు. వీరంతా వారి వారి పనులు చూసుకొని ఇండ్లకు వెళ్లి, పిల్లలతో ముద్దుమురిపాలు పంచుకుంటున్నవారే. కోవిడ్ వ్యాప్తి జరిగితే పెద్దల నుంచే పిల్లలకూ సోకే ప్రమాదం ఉంది. బడికెళ్తేనే కోవిడ్ వ్యాప్తి అవుతుందనీ, పిల్లల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది కాబట్టి తట్టుకోలేరనే ప్రచారమూ జరుగుతోంది. దీనిపై ప్రభుత్వం వద్ద స్పష్టమైన మార్గదర్శకాలు, జాగ్రత్తలు, నిధుల కేటాయింపు వంటివి మచ్చుకు కనిపించట్లేదు. కోర్టు ఆదేశాలతో విద్యార్థులను హాజరు నుంచి మినహాయింపు ఇచ్చిన ప్రభుత్వం, ఆన్‌లైన్ క్లాసులు జరుగుతాయా లేదా అనే దానిపై మంగళవారం ఇచ్చిన ఉత్తర్వుల్లో స్పష్టంగా చెప్పలేదు. అయితే పాఠశాల విద్యాశాఖకు సంబంధించిన పూర్తిస్థాయి విధివిధానాలను వారం రోజుల్లోపు ఇవ్వాలని విద్యాశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పేర్కొన్నారు. బహుశా అప్పటికి కోర్టు ఇచ్చే తుది గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా ఉత్తర్వులు ఇవ్వొచ్చనే ఉద్దేశ్యం ఉండొచ్చు. ఏడాదిన్నరగా విద్యార్థులకు స్కూళ్లు లేవు. ఆన్‌లైన్ తరగతుల్లో వారికి ఏం అర్థమైందో తెలీదు. పై తరగతులకు ప్రమోట్ అవుతున్నారు. పిల్లల చదువు విషయంలో తల్లిదండ్రులు ఆందోళనలోనే ఉన్నారు. పోటీ ప్రపంచంలో తమ పిల్లలు ఎక్కడ వెనుకబడిపోతారో అనే భయం వారిలో ఉంది. అదే సందర్భంలో కరోనా రక్కసి భయాందోళనా వెంటాడుతోంది. అయినా మెజారిటీ తల్లిదండ్రులు పిల్లల్ని స్కూళ్లకు పంపాలనే నిశ్చితాభిప్రాయంతోనే ఉన్నట్టు తెలుస్తున్నది. కాకపోతే విద్యాసంస్థల్లో కోవిడ్ నిబంధనల అమలు, రవాణా సౌకర్యాలపైనే వారిలో ఆందోళన ఉంది.

# బాలకాండ అఖండ పారాయణంతో మార్మోగిన సప్తగిరులు

తిరుమల, సెప్టెంబర్ 02, ప్రపంచంలోని ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల నాదనీరాజనం వేదికపై గురువారం ఉదయం జరిగిన బాలకాండలోని ప్రథమ, ద్వితీయ సర్గలలో ఉన్న మొత్తం 143 శ్లోకాలను వేద పండితుల అఖండ పారాయణంతో సప్తగిరులు మార్మోగాయి. బాలకాండ పారాయణ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఆధ్యాపకులు ఆచార్య ప్రవా రామక్రిష్ణ సోమయాజులు మాట్లాడుతూ మన పూర్వీకులు మనకు అందించిన దివ్య శక్తి మంత్రోచ్ఛరణ అని, దీనితో సమస్త రోగాలను నయం చేయవచ్చని తెలిపారు. ప్రపంచ శాంతి, కరోనా మూడవ వేవ్ చిన్న పిల్లలను ఇబ్బంది పెడుతుందని ప్రభుత్వాలు, వైద్య సంస్థలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో పిల్లలు, పెద్దలు అన్ని వర్గలవారు సుఖశాతంతులతో ఉండాలని బాలకాండ పారాయణం నిర్వహస్తున్నట్లు చెప్పారు. బాలకాండ ప్రథమ, ద్వితీయ సర్గల్లోని మొత్తం 143 శ్లోకాలను, విషూచికా మహమ్మరి నివారణ మంత్ర పారాయణం ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారంలో కోట్లాది మంది ప్రజలు ఒకేసారి పారాయణం చేస్తే ఫలితం అనంతంగా ఉంటుందన్నారు. దీనిని పారాయణం చేయడం వలన ఆరోగ్యం, సుఖం, శాంతి, విద్యా, ఐశ్వర్యం సిద్ధిస్తాయని వివరించారు.ఆచార్య ప్రవా రామక్రిష్ణ సోమయాజులు పర్యవేక్షణలో డా.కోగంటి రామానుజాచార్యులు, శ్రీ ఇంద్రకంటి సత్య కిషోర్ పారాయణం చేశారు. అఖండ పారాయణంలో ధర్మగిరి వేద పాఠశాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేద అధ్యాయన సంస్థకు చెందిన వేద పారాయణ దారులు, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంకు చెందిన శాస్త్రీయ పండితులు పాల్గొన్నారు. ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు వందన బృందం " రామరామ జయ రాజ రామ్.....రామరామ జయ సీతా రామ్ ... ", అనే సంకీర్తనను కార్యక్రమం ప్రారంభంలో, " శ్రీ హనుమాన్ జయ హనుమాన్ జయ జయ కపివర బహుబలవాన్ ......." అనే సంకీర్తనను కార్యక్రమం ముగింపులో సుమధురంగా అలపించారు.

# మహిళా భద్రతకోసమే దిశ చట్టం

గుంటూరు మహిళల భద్రత కోసం దిశ చట్టాన్ని తీసుకొచ్చామని రాష్ట్ర హోంమంత్రి మేకతోటి సుచరిత పేర్కొన్నారు.గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ దిశా చట్టం రాష్ట్రపతి అనుమతి పొందే సమయానికల్లా చట్టాన్ని అమలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మరోవైపు కొంతమంది దిశ పోలీస్ స్టేషన్ల వద్ద ఆందోళన చేస్తున్నారని, అలా దిశ పోలీస్ స్టేషన్ ముందు ధర్నాలు చేయడం బాధాకరమని అసహనం వ్యక్తం చేశారు. అనేక మంది మహిళలు ఇప్పటికే దిశ యాప్ ద్వారా రక్షణ పొందుతున్నారని గుర్తు చేశారు.గతం ప్రభుత్వంలో మహిళా తహశీల్దార్ పై ఎమ్మెల్యే దాడి చేసిన పట్టించుకోలేదని, మరి ఇప్పుడు అదే టీడీపీ శ్రేణులు దిశ చట్టాన్ని అవహేళన చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ చట్టం ద్వారా ఏడు రోజుల్లోనే ఛార్జ్ షీట్ వేస్తున్నారని, ఇప్పటికీ ఆ విధంగా 1500 కేసుల్లో 7రోజుల్లో ఛార్జిషీటు వేశామన్నారు. మహిళా రక్షణ కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని వ్యాఖ్యానించారు. దిశ చట్టాన్ని రాజకీయ లబ్ది కోసం వాడుకోవద్దని, ఏదైనా ఘటన జరగగానే దాన్ని మానవతా దృక్పథంతో చూడకుండా కొంతమంది రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు.

# 21 మంది చందనం స్మగ్లర్లు ఆరెస్టు

చిత్తూరు చిత్తూరు జిల్లా లో పెద్ద సంఖ్యలో ఎర్రచందనం స్మగ్లర్ల దాడిలో పోలీసులకు పట్టుబడ్డారు. వడమాలపేట సమీపంలో 21 మంది తమిళ స్మగ్లర్లు ను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి ఇనుప గొడ్డళ్లు, కూరగాయలు, నిత్యావసర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు చిత్తూరు జిల్లా పుత్తూరు సమీపంలోని వడమాలపేట అటవీ ప్రాంతంలో పెద్దసంఖ్యలో ఎర్రచందనం స్మగ్లర్ల దాడిలో పోలీసులకు పట్టుబడ్డారు. ఎర్రచందనం కోసం అడవిలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన 21 మంది తమిళ స్మగ్లర్లు ను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. స్మగ్లర్లు సమాచారం అందుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు వడమాల పేట అంజారమ్మ కనుమ ఆలయం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అయితే పోలీసులు వారిని చుట్టు ముట్టి డ్రైవర్ తో సహా 21 మందుని అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడు కు చెందిన మెస్త్రీ అమరేశన్ ఎర్రచందనం దుంగలు కోసం తీసుకుని వస్తున్నట్లు విచారణ లో అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు వీరి నుంచి నిత్యావసర వస్తువులు, కూరగాయలు, 10 ఇనుప పిడిలేని గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇంకా వీరి దగ్గర 12 సెల్ ఫోన్లు, 10,910 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కాగా వీరిలో ఐదుగురిని జువెనెల్ హోం తరలించగా, 16 మండిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

# ప్రజలపై పెను భారం మోపుతున్న చెత్తపన్నుల, రద్దు చేయాలని మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా:సీపీఐ




ఎమ్మిగనూరు సెప్టెంబర్ 2, (( విభారె) పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై పన్నుల రూపంలో అధిక భారం మోపుతూ ,చెత్త పన్ను, సంబంధించిన జీవో నెంబర్ 196,197,198 రద్దు చేయాలని కోరుతూ సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా అనంతరం ఆవ వెంకటేశ్వర్లు గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా వారు సీపీఐ పట్టణ కార్యదర్శి తిమ్మగురుడు, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి హనుమంతు, సమీ ఉల్లా మాట్లాడుతూ పట్టణాలు అభివృద్ధి పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల్లో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ దేశ్ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వేల కోట్ల రుణాలు ఆశపడి ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి ఆస్తిపన్ను చట్టాలను సాధించిందని ఇది స్థానిక సంస్థల ఆర్థిక పరిపుష్టికి స్థానిక సంస్థల మనుగడకు విరుద్ధమైన చర్య అని ఇది 93 94 వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి విరుద్ధమని వారు తెలిపారుజీవో నెంబర్ 96 97 ల ప్రకారం ప్రతి సంవత్సరం మంచి నీరు డ్రైనేజీ ఛార్జీలు పెంచుకునే అవకాశం కలిగింది నెలకు 100 నుండి 350 రూపాయల వరకు వసూలు చేసే అధికారం నీటి మీటర్లు పెట్టడానికి రంగం సిద్ధం చేస్తున్నారు ఎన్ని మరుగుదొడ్లు ఉంటాయో నెలకు 40 రూపాయల వరకు డ్రైనేజి చార్జీలు వసూలు చేస్తారు చెత్త పనులు కూడా దుర్మార్గమైన విషయం చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జిఎస్టి తో సహా అనేక రకాల పన్నులు వసూలు చేస్తున్నారు న్యాయబద్ధంగా చట్టబద్ధంగా ఆర్థిక సంఘాల ద్వారా స్థానిక సంస్థలకు మంజూరు అయిన రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్నాయి కేంద్రం నుండి మంజూరైన నిధులతో రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వరకు స్థానిక సంస్థలకు కేటాయించాలి. ఇది జరుగుతుందా అనే సందేహం కలుగుతుంది. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి స్థానిక కౌన్సిళ్లు సమీక్షించి పన్నులు పెంచాలా వద్ద అనే స్థానిక కౌన్సిళ్లు నిర్ణయాధికారాన్ని కి పాలకులు తిలోదకాలు ఇస్తున్నారని వారు తెలిపారు. కార్పొరేట్లకు పెద్దపీట వేసే మోడీ నిర్ణయాలకు రాష్ట్ర ప్రభుత్వం తల ఊపుతుంది మరి కార్పొరేషన్లు మున్సిపాల్టీల్లో ఎందుకు అని వారు తీవ్రంగా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విధించిన షరతులకు రాష్ట్రప్రభుత్వం లొంగిపోయి ఎన్ని ఎన్నికల ముందు వైఎస్ఆర్ సీపీ ఇచ్చిన వాగ్దానాన్ని తుంగలో తొక్కి "మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు"ప్రజలపై ఆస్తి విలువ ఆధారిత పన్ను భారాన్ని మోపిందని వైఎస్ఆర్సిపి చిత్తశుద్ధి ఉంటే నూతనంగా ఎన్నికైన కార్పొరేషన్లు మరియు మున్సిపాలిటీల ప్రత్యేక కౌన్సిల్ సమావేశం జరిపి జిఓ నెంబర్ 196 197 198 పిల్లలు రద్దు చేయాలని వారు తెలిపారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు సిద్ధమవుతోందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ప్రజాసంఘాల నాయకులు కేసి జబ్బార్ , బాలరాజు, విజేంద్ర , ఖాజా,మల్లికార్జున గౌడ్, మాధవ్ సోమశంకర్,రవి, నూర్, నాగేంద్ర, మునిస్వామి, ధర్మ, నరసింహుడు, పాల్గొన్నారు

# పారిశుద్ధ్య లోపం కారణంగా రోగాలతో అల్లాడుతున్న ప్రజలుకనిపించకుండా తిరుగుతున్న అధికారులు ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి

యస్ యమ్ డి .యూనుస్



నంద్యాల సెప్టెంబర్ 2, (( విభారె) నంద్యాల పట్టణం ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని వర్షాకాలం కారణంగా మురుగుకాలువలు లేక వర్షపు నీరంతా రోడ్లపై నిల్వ ఉంటుందని దీంతో దోమలు వ్యాప్తి విపరీతంగా పెరిగిపోతుందని ప్రజలు రోగాలబారిన పడుతున్నారని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి. యస్ యమ్ డి యూనుస్ అన్నారు.చిన్నపాటి వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి అని అన్నారు దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. దోమల బెడద కు ప్రజలు ఆందోళన చెందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. సాధారణ జ్వరం నుంచి మలేరియా, డెంగీ, విష జ్వరాలు నంద్యాల లో జీవిస్తున్న ప్రజలు సతమతమవుతున్నారు అని తెలిపారు. మున్సిపాలిటీ శాఖ నుంచి సకాలంలో నిధులు విడుదల కాకపోవడం, కొన్ని పనులకు బిల్లులు రాక పోవడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు సవ్యంగా సాగడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు.కర్నూలు డివిజన్‌లో 267, నంద్యాల 310, ఆదోని డివిజన్‌లో 344 గ్రామాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం వర్షాలు బాగా పడుతుండటంతో సీజనల్ వ్యాధులు సైతం ప్రారంభమయ్యాయి అని పేర్కొన్నారు. ప్రత్యేకించి విష జ్వరాలు, డెంగీ లక్షణాలతో ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఆస్పత్రి పాలవుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాలల్లో ఆశించిన విధంగా పారిశుద్ధ్య పనులు సాగడం లేదని పాలక వర్గాలు ఏర్పాటు అయినా నిధుల వినియోగం అంతంతమాత్రమే ఉందన్నారు. రోజులుగా నంద్యాల డివిజన్లలో కురిసిన వర్షాలకు విష జ్వరాలు ప్రబలుతున్నా సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించే దిశగా అధికారులు ఆలోచనలు చేయలేదని విమర్శించారు. సాధారణ నిధులతోపాటు 15వ ఆర్థిక సంఘం నిధులను పారిశుద్ధ్య పనులు చేసేందుకు వినియోగించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీకి కేటాయించాలనే స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని అన్నారు. పారిశుద్ధ్యానికి ప్రత్యేక నిధుల కేటాయింపు చేయాలని తెలిపారు. ప్రతి నెలా 2వ తేదీ, 17వ తేదీ ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాల్సి ఉండగా జిల్లా వ్యాప్తంగా 50 శాతం గ్రామాల్లో ఆ ఊసే లేదన్నారు. ఇక ఫాగింగ్ అధ్వానంగా ఉంది అని తెలిపారు. మురుగు కాల్వల శుభ్రత, ముళ్ల పొదల తొలగింపు కాగితాలకే పరిమితమైన అన్నారు. పనితీరుపై నంద్యాల ప్రజలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి అని ప్రజలకు అందుబాటులో అధికారులు ఉండాలని అన్నారు.

# జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం



కర్నూలు సెప్టెంబర్ 2, (( విభారె) జన హృదయ నేత డా" వైఎస్ రాజశేఖర రెడ్డి ... జాన్ విల్సన్ కర్నూలు ప్రతినిధి జన హృదయ నేత డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి గారని కర్నూలు నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు జాన్ విల్సన్ అభిప్రాయపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వర్యులు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి గారు ముఖ్యమంత్రులకే ఆదర్శప్రాయుడని కరుడుగట్టిన కాంగ్రెస్ వాది అని దేశం గర్వించదగ్గ నాయకుడని ఆయన స్వచ్ఛమైన పాలన సాగించారని అలాగే కాంగ్రెస్ అధిష్ఠానం రాజశేఖర రెడ్డి గారికి పూర్తి స్వేచ్ఛ నిచ్చిందని ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దేశంలో ఎక్కడా అమలు చేయని పథకాలు ప్రవేశపెట్టి వాటిని అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లు పెంపు, రుణమాఫీ, ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ గృహకల్ప, అత్యవసర వైద్యం కోసం 108 ,104వాహనాలు, రైతులకు ఉచిత విద్యుత్, పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి దేశంలోని ముఖ్యమంత్రులకు ఆదర్శంగా నిలిచారని జాన్ విల్సన్ పార్టీ కార్యాలయంలో జరిగిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గారి 12 వ వర్ధంతి కార్యక్రమంలో కార్యకర్తల సమావేశంలో ఆయన సేవలను కొనియాడారు. ముందుగా

## కళా వెంకటరావు భవనం

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గారి చిత్రపటమునకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కార్యకర్తల సమావేశం జరిగినది సమావేశంలో వక్తలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎంసుధాకర బాబు, కోడుమూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి దామోదరం రాధాకృష్ణ , జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు పోతుల శేఖర్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న డాక్టర్స్ సెల్ అధ్యక్షులు అమరేంద్రరెడ్డి, డిసిసి సెక్రటరీ అభినాయుడు కాంగ్రెస్ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు ఈశ్వర్ కాంగ్రెస్ నాయకులు చిసత్యరాజు డిసిసి సెక్రటరీ అభినాయుడు, బివి సుబ్రహ్మణ్యం, రియాజ్, దూద్ పీర, బాలాజిప్రసాద్, కేశవరెడ్డి, మహిళా కాంగ్రెస్ సారమ్మ కేవీ లక్ష్మి ఎల్లమ్మ మద్దమ్మ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా వైఎస్ రాజశేఖరరెడ్డి 12 వ వర్ధంతి

ఎమ్మిగనూరు సెప్టెంబర్ 2, (( విభారె) పట్టణంలో దివంగత మహానేత డాక్టర్ "వైఎస్ రాజశేఖరరెడ్డి" గారి 12వ వర్ధంతి సందర్భంగా మన ప్రియతమ నాయకులు, పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, నియోజకవర్గ సీనియర్ నాయకుడు



"ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి" గారి ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ర్యాలీగా వెలుతు వైయస్సార్ సర్కిల్ లో వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుండి సోమప్ప సర్కిల్లో దివంగత మహానేత డాక్టర్ "వైఎస్ రాజశేఖరరెడ్డి" గారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పటించినారు. ఈ సందర్భంగా "ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి" గారు మాట్లాడుతూ స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గారు చేపట్టిన సంక్షేమ పథకాలు ఉమ్మడి రాష్ట్ర ప్రజలు మారువలేనివి అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి గారు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోయిన మహానాయకుడు, వైయస్సార్ అలాంటి నాయకుడి ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరు కృషి చేయాలి అని అన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు, పాలు పంపిణీ చేస్తున్న నియోజకవర్గ సీనియర్ నాయకుడు "ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి" గారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్ గారు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెయస్. రఘు గారు


# రోజు రోజుకు ఆకాశాన్ని అంటూతున్న గ్యాస్ ధరలు లబోదిబోమంటున్న సామాన్య ప్రజలు

సీపీఐ నాయకులు ప్రసాద్. బాబా ఫక్కృద్దీన్




నంద్యాల సెప్టెంబర్ 2, (( విభారె) ఇష్టారాజ్యంగా గ్యాస్ ధరలు పెంచుతున్న బిజెపి ప్రభుత్వానికి పతనం తప్పదు అంటున్న సీపీఐ నాయకులు. బిజెపి ప్రభుత్వాన్ని హెచ్చరించిన సీపీఐ నంద్యాల నియోజకవర్గ, పట్టణ కార్యదర్శులు బాబా ఫక్రుద్దీన్,ప్రసాద్. పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని కోరుతూ నరేంద్ర మోడీ ప్రజా వ్యతురేఖ విధానాలను నిరసిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)ఆధ్వర్యంలో నంద్యాలలో మౌలానా ఆజాద్ సర్కిల్ లో గురువారం నాడు ధర్నా నిర్వహించడం జరిగిందని సీపీఐ నంద్యాల నియోజకవర్గ, పట్టణ కార్యదర్శులు బాబా ఫక్రుద్దీన్,ప్రసాద్ లు తెలిపారు.


# సక్సెస్ సెంటిమెంట్ తో వెంకీ ఓటీటీ ఎంట్రీ



విక్టరీ వెంకటేష్ తన కెరీర్ లో ఎన్నో రీమేక్ లు చేశాడు. టాలీవుడ్ లో ఎంతో మంది హీరోలు రీమేక్ లు చేశారు. కాని వెంకటేష్ చేసినన్ని రీమేక్ సినిమాలు మరెవ్వరు చేయలేదు అనడంలో సందేహం లేదు. ఈ ఏడాదిలో ఇప్పటికే వచ్చిన నారప్ప సినిమా తమిళ మూవీకి రీమేక్ గా త్వరలో విడుదల కాబోతున్న దృశ్యం 2 సినిమా కూడా మలయాళం దృశ్యం 2 కు రీమేక్ అనే విషయం తెల్సిందే. ప్రస్తుతం కూడా వెంకటేష్ రీమేక్ లపైనే దృష్టి పెట్టాడు. ఒక కొరియన్ మూవీని రీమేక్ చేసేందుకు గాను ఏర్పాట్లు చేస్తున్నట్లుగా సమాచారం అందుతోంది. ఇదే సమయంలో వెంకీ మామ త్వరలోనే ఓటీటీలో ఎంట్రీ ఇచ్చేందుకు ఆసక్తిగా ఉన్నాడు. ప్రస్తుతం ఓటీటీ టైమ్ నడుస్తుంది. కనుక ఓటీటీలో కంటెంట్ చేసేందుకు చాలా మంది స్టార్స్ ముందుకు వస్తున్నారు. వెంకీ కూడా వెబ్ సిరీస్ ను చేసేందుకు సిద్దం అయ్యాడు.బాలీవుడ్ లో ఎంతో మంది స్టార్స్ వెబ్ సిరీస్ లు చేస్తున్నారు. ఈ సమయంలోనే సౌత్ స్టార్స్ లో మొదటగా వెంకటేష్ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్దం అవుతున్నట్లుగా సమాచారం అందుతోంది. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం తనకు కెరీర్ లో ఎన్నో సక్సెస్ లు రీమేక్ ల ద్వారానే వచ్చాయి. కనుక తన ఓటీటీ ఎంట్రీ కూడా రీమేక్ ద్వారానే ఉంటే బాగుంటుంది అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. అందుకే సురేష్ బాబు ఒక స్పానిష్ సిరీస్ ను రీమేక్ చేయబోతున్నట్లుగా తెలుస్తోంది. సురేష్ బాబు ఆ స్పానిష్ సిరీస్ హక్కులను కొనుగోలు చేశాడట.నెట్ ఫ్లిక్స్ వారు ఈ వెబ్ సిరీస్ ను మొదట రీమేక్ చేసేందుకు గాను ప్రయత్నాలు చేసిందట. కొన్ని కారణాల వల్ల సిరీస్ రీమేక్ ను నెట్ ఫ్లిక్స్ వారు డ్రాప్ అయినా కూడా సురేష్ బాబు ఆ సిరీస్ ను రీమేక్ చేసేందుకు ఆసక్తిగా ఉన్నారని తెలుస్తోంది. వెంకటేష్ ఇమేజ్ కు తగ్గట్లుగా ఆ సిరీస్ ఉంటుందని అంటున్నారు. రీమేక్ చేసిన తర్వాత సురేష్ బాబు ఓటీటీ కి అమ్మేయబోతున్నాడు. వెంకటేష్ రీమేక్ లతో సెన్సేషనల్ సక్సెస్ లను దక్కించుకున్నాడు. కనుక ఓటీటీ ఎంట్రీ కూడా రీమేక్ కనుక ఖచ్చితంగా మంచి విజయాన్ని సొంతం చేసుకుంటాడు అనే నమ్మకంను వ్యక్తం చేస్తున్నారు.

# మోస్ట్ బ్యూటీఫుల్ జోడీ మళ్లీ మళ్లీ..!


బాలీవుడ్ సూపర్ హిట్.. అవార్డ్ విన్నింగ్ మూవీ 'గల్లీబాయ్' లో రణ్వీర్ సింగ్ మరియు ఆలియా భట్ కలిసి నటించిన విషయం తెల్సిందే. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. సినిమా కేవలం కమర్షియల్ సక్సెస్ అని కాకుండా విమర్శకుల ప్రశంసలు దక్కించుకోవడంతో పాటు హీరో హీరోయిన్ ల కాంబో సన్నివేశాలు రొమాంటిక్ సన్నివేశాలకు మంచి ఆధరణ దక్కింది. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా రణ్వీర్ మరియు ఆలియాలు నటించి మెప్పించారు. వారిద్దరి జోడీని మళ్లీ మళ్లీ చూడాలని అభిమానులు కోరుకుంటున్నారు.అందుకే ఇప్పటికే వీరిద్దరు బాలీవుడ్ స్టార్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ దర్శకత్వంలో ఒక సినిమాను చేస్తున్నారు. ఆ సినిమా కరోనా కారణంగా కాస్త ఆలస్యం అవుతూ ఉంది. ఆ సినిమా చేస్తూ ఉండగానే వీరిద్దరు కలిసి మళ్లీ నటించేందుకు సిద్దం అయ్యారు. ఈసారి బిగ్గెస్ట్ చిత్రాల దర్శకుడిగా పేరున్న సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో వీరు సినిమాను చేయబోతున్నారు. సంజయ్ లీలా భన్సాలీ ప్రస్తుతం గంగూభాయ్ సినిమాను ఆలియా భట్ తో చేస్తున్నాడు. ఆ సినిమా విడుదలకు సిద్దంగా ఉంది. ఆ సినిమా విడుదల కాకుండానే తదుపరి సినిమాను అదే ఆలియా భట్ తో రూపొందించేందుకు గాను సిద్దం అయ్యాడు.బైజు బావ్రా అనే టైటిల్ తో సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించబోతున్న సినిమాలో ఆలియా భట్ మరియు రణ్ వీర్ సింగ్ నటించబోతున్నట్లుగా తెలుస్తోంది. వీరిద్దరి జోడీ వల్ల సినిమాకు ఖచ్చితంగా మంచి బజ్ ఏర్పడుతుంది. సినిమాలో హీరో మరియు హీరోయిన్ గా వీరిద్దరిని సంజయ్ లీలా భన్సాలీ చూపించబోతున్న విధానం గురించి బాలీవుడ్ మీడియా చాలా ఆసక్తి కలిగేలా కథనాలు రాస్తుంది. పీరియాడిక్ డ్రామాగా ఒక విభిన్నమైన కాన్సెప్ట్ తో బైజు బావ్రా రూపొందుతున్నట్లుగా బాలీవుడ్ వర్గాల వారు చెబుతున్నారు. కనుక ఈ సినిమా తో మరోసారి ఆలియా మరియు రణ్వీర్ లు సక్సెస్ దక్కించుకుంటారు అనే నమ్మకంను వ్యక్తం చేస్తున్నారు.



# కెరీర్‌లో చాలా ఎదగాలి.. పెళ్లికి తొందరేంలేదు




లాహోర్: పాకిస్తాన్ యువ సంచలనం.. బౌలర్ షాహిన్ అఫ్రిది తన పెళ్లిపై క్లారిటీ ఇచ్చాడు. కెరీర్‌లో ఇంకా చాలా ఎదగాల్సి ఉందని.. పెళ్లికి ఇప్పుడేం తొందర లేదని తెలిపాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పాకిస్తాన్ మాజీ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిది కూతురు అక్సా అఫ్రిదితో వివాహం జరగనున్నట్లు వార్తలు వచ్చాయి. వీరిద్దరి పెళ్లి జరగబోయేది నిజమేనని.. ఎప్పుడు చేయాలనేది మా రెండు కుటుంబాలు మాట్లాడుకుంటామని షాహిద్ అఫ్రిది కూడా మీడియాకు గతంలోనే వెల్లడించాడు. తాజాగా షాహిన్ అఫ్రిది తన పెళ్లిపై వస్తున్న వార్తలకు మరోసారి చెక్ పెట్టాడు. "నా పెళ్లికి ఇప్పుడేం తొందర లేదు. కెరీర్‌లో ఇది నాకు కీలక సమయం. అన్ని ఫార్మాట్లలో రెగ్యులర్ బౌలర్‌గా మారుతున్న సమయం. ఇలాంటి దశలో ఎలా ముందుకు వెళ్లాలన్నది మాత్రమే ఆలోచిస్తున్నా. బౌలింగ్‌లో రికార్డుల గురించి పెద్దగా పట్టించుకోను. జట్టు తరపున ఆడామా.. మ్యాచ్‌లో వికెట్లు పడగొట్టామా.. గెలిపించామా అన్న చందంగా నా కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటున్నా. బౌలింగ్‌లో మంచి ఫాం కనబరిస్తే రికార్డులు వాటంతట అవే వస్తాయి. నాకు తెలిసి శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకుంటూ జట్టుకు సుదీర్ఘ కాలం పాటు సేవలందించాలని అనుకుంటున్నా. ఇక రమీజ్ రజాను పీసీబీ చైర్మన్‌ను చేయడంపై సంతోషంగా ఉంది." అంటూ చెప్పుకొచ్చాడు.ఇక షాహిన్ అఫ్రిది ప్రస్తుతం పాకిస్తాన్ జట్టులో కీలక బౌలర్‌గా ఎదుగుతున్నాడు. అన్ని ఫార్మాట్లలోనూ మంచి ఫామ్ కనబరుస్తున్న షాహిన్ ఇటీవలే విండీస్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో అదరగొట్టాడు. రెండో టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లు కలిపి 10 వికెట్లు తీసిన అఫ్రిది మ్యాచ్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఓవరాల్‌గా షాహిన్ అఫ్రిది పాకిస్తాన్ తరపున 19 టెస్టుల్లో 76 వికెట్లు, 28 వన్డేల్లో 53 వికెట్లు, 30 టీ20ల్లో 32 వికెట్లు పడగొట్టాడు.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190